సనాతన సారథి

ఆగస్టు 2021

‘చిన్మయరూపంబిదియే చిత్తతాపహరమిదియే – ఆశ్రితజన పారిజాత మానందామృత మిదియే’

సనాతన సారథి

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలద్వారా మానవజాతి సామాజిక,
నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అర్పితము

సంపుటము 64
సంచిక 8

ఆగస్టు 2021

ప్రచురణ తేదీ
జులై 23

1. **రామకథారస వాహిని** (ధారావాహికం)	**భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు**	4
2. **స్వారాజ్యసిద్ధి**	స్వాతంత్ర్య దినోత్సవ సందేశం	7
3. **'భరత సంస్కృతి నెలకొల్పవలయు నేడు'**	శ్రీ సత్యసాయి పద్యసుధ	10
4. **తెలంగాణ సాయిసంస్థల కోవిడ్-19 సేవలు**	పి. వెంకట్రావ్	11
5. **ఆదర్శ అధ్యాపకుడు**	ఆర్. సీతాలక్ష్మి	14
6. **దివ్యస్మృతులు**	ప్రొ॥ చెల్లి జనార్ధన	17
7. **'సాయీ యని తీయగా పాడనా'**	ఎమ్.ఎస్. ప్రకాశరావు	19
8. **సుందర సాయి సుమధుర సంభాషణలు**	డా॥ దువ్వూరి ఇందిరాదేవి	20
9. **సౌందర్య సుషమ**	స్వర్గీయ ఎస్.బి. రఘునాథాచార్య	24
10. **అవతార వైభవంలో...** *(గత సంచిక తరువాయి)*	పి.వి. చలం	27
11. **ప్రార్థనా పారిజాతాలు**	బాలరామచంద్రన్	33
12. **జీవుడే దేవుడు**	*1961 ఆగస్టు 'సనాతన సారథి' నుండి*	40
13. **'పుట్టపర్తి సాయిదేవా!'**	శ్రీ సత్యసాయి గీతములు - *17*	41
14. **పరిమళించిన పూలతోట**	'కరుణశ్రీ'	42

© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతినిలయం

చందాదారులకు విజ్ఞప్తి: 'సనాతన సారథి' ప్రతి నెల మొదటి వారంలోగా చందాదారులకు అందవలసియున్నది. ఒకవేళ 10వ తేదీనాటికి కూడా అందకపోతే మీ చందా నంబర్‌ను పేర్కొంటూ, **9440287375** కి 'వాట్సాప్ మెస్సేజ్' పంపితే వెంటనే మీకు మరొక కాపీ పంపించడం జరుగుతుంది. మీ చందాను పునరుద్ధరించుకోవలెనన్నా మరియు మీ పోస్టల్ అడ్రసును మార్చవలెనన్నా ఇదే నంబర్‌కు 'వాట్సాప్ మెస్సేజ్' పంపవలసిందిగా కోరుతున్నాము. మరిన్ని వివరాలకు **www.sanathanasarathi.org** ను సందర్శించగలరు.

గమనిక: ఈ పత్రికలోని వ్యాసములు, అభిప్రాయములు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి ఎడిటర్ కానీ, పబ్లిషర్ కానీ బాధ్యత వహించరు. **E-mail:** subscriptions@sssbpt.org, editor@sssbpt.org

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా (ఆం.ప్ర) – 515134 తరపున ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్ షెడ్ (120'X40')లో ముద్రింపబడి ప్రచురింపబడింది.

ప్రింటర్ అండ్ పబ్లిషర్ : కె.ఎస్. రాజన్, ఎడిటర్ : వి. శ్రీనివాసులు

భగవాన్ శ్రీ సత్యసాయీశ్వర విరచిత

రామకథారస వాహిని

(గత సంచిక తరువాయి - 82వ భాగం)

10. సంజీవని పర్వతము

వానరులు నగరమున ప్రవేశించుచున్నారన్న వార్త విని, మేఘనాథుడు రౌద్రాకారుడై ఆయుధములను ధరించి బయలుదేరెను. రాక్షసులు రణభేరులను మ్రోగించిరి. ఇంద్రజిత్తు అతిరథశ్రేష్ఠుడు! వానిం జూచి వానరులు పరుగెత్తిరి. పరుగెత్తు వానరులను మేఘనాథుడు రౌద్రాకారుడై వీరాలాపము లాడుచు, బాణములను సంధించి ఆకర్ణాంతము లాగి ప్రయోగించెను. రెక్కలు కల కాలసర్పముల వలె ఆ బాణములు నలువైపులా పరుగులెత్తెను. వానరులు వాని ఎదుటపడుటకు భయపడిరి; నిరుత్సాహులైరి. యుద్ధము చాలించి మరలిరి. కొందరు ఆ బాణముల బారికి నేలకూలిరి; మూర్ఛిల్లిరి. ఈ వానర సైన్యముల వ్యాకులమును జూచి హనుమంతుడు కోపించి మేఘనాథుని మీదికి కాలునివలె పరుగెత్తెను. చెంతనున్న పర్వతము యెత్తి వానిపై విసరెను. కాలాంతకునివలె వచ్చుచున్న పర్వతమును మేఘనాథుడు చూచి అంతరిక్షమునకు ఎగిరెను. వాని రథమును, రథాశ్వములును, సారథియు దాని క్రిందపడి నలిగిపోయిరి. అంత మేఘనాథుడు రాక్షసమాయలను అనేకము పన్నెను. ఒక చిన్న పాము గరుత్మంతుని బెదిరించిన విధమున వాడు హనుమంతుని బెదిరించెను.

అంతటితో మానక, అంతరిక్షమునుండి మేఘనాథుడు నిప్పులను వర్షించెను. రక్త వర్షమును కురిపించెను. పట్టపగలు గాఢాంధకారము వ్యాపించెను. ఎవని హస్తము వానికి కనబడ లేదు. ఈ విధమైన మాయలచేత వానరులు మరింత వ్యాకులబడిరి; వానరులు నేటితో తమ జీవితములు అంత్యమగునని భావించిరి. ఈ రాక్షస మాయలను చూచి శ్రీరాముడు లోలోన నవ్వి, వానరులు అధైర్యపడుచున్నారని గుర్తించి, ఒక బాణమును ప్రయోగించెను. అంత ఆ రాక్షసుని మాయ మటుమాయమయ్యెను. సూర్యోదయము వలన అంధకారము వీడునట్లు రాక్షసుని మాయ వీడిపోయెను. వానరులను శ్రీరాముడు కటాక్షదృష్టితో చూచెను. వానరుల శ్రమ శాంతించెను. వారు ప్రబలులై యుద్ధమునకు వెడలిరి. ఒక్కతూరి "శ్రీరామచంద్ర ప్రభువుకు జై" అని జేజేలు కొట్టుచూ రణమున దుమికిరి. వారిని నిరోధించుట శక్యము కాకపోయెను.

దీనికితోడు శ్రీరామాజ్ఞ ప్రకారము లక్ష్మణుడు ధనుర్బాణములు పట్టి హనుమంతునితో కూడి మేఘనాథునితో యుద్ధము చేయుటకు వచ్చెను. లక్ష్మణుడు మేఘనాథునెదుర్కొనెనని రావణుడు విని, తన కుమారునికి బలమైన మరికొంతమంది రాక్షసులను సహాయ నిమిత్తము పంపెను. వానరులకు వృక్షములు, శిలలే ఆయుధములు. ఉభయ సైన్యములు ఉద్దండ పరాక్రమమున

విజృంభించి ద్వంద్వయుద్ధము చేయుచుండిరి. వానరులు పిడికిళ్ళతో గుద్ది నోటితో రాక్షసులను కొరికి, అదిమి చంప మొదలుపెట్టిరి. తలలు తెగగొట్టిరి. భుజములు వూడబెరికిరి. వానరులు చేయు ధ్వనులు నవద్వీపములలో నిండెను. శిరములు లేని రాక్షసుల మొండెములు పరువులెత్తుచుండుట చూచి వానరులు నవ్వుతూ మరొకవైపున ఆశ్చర్యపడుతూ కేకలు వేసిరి. రణభూమిమీద, లంకలోని జనసంచారపు రహదారుల మీద రక్తము నిండెను, ప్రవహించెను.

లక్ష్మణుడు, మేఘనాథుడు భయంకరముగా పోరాడిరి. వారి పోరాటంలో ఒకరికొకరు సమానంగా కనుపించిరి. ఇంద్రజిత్తు మాయోపాయములు పన్ని లక్ష్మణుని జయింపతలచెను. కాని వాని ప్రయత్నములు వ్యర్థములయ్యెను. లక్ష్మణుడు ఉగ్రుడై ఇంద్రజిత్తు రథమును కూల్చి రథసారథిని చంపెను. అంత ఇంద్రజిత్తు ఇంతటితో తన ప్రాణములు పోవునని తలంచి దేదీప్యమానముగా వెలుగుచున్న బ్రహ్మ దత్తమగు మహాశక్తిని తీసి లక్ష్మణుని హృదయమునకు తగులునట్లుగా గురిచూచి ప్రయోగించెను. అది వచ్చి లక్ష్మణుని హృదయమునకు తగిలెను. వెంటనే లక్ష్మణుడు మూర్ఛిల్లెను. అంత వాడు నిర్భయుడై నేలపడిన లక్ష్మణుని చెంతకు వచ్చెను. మేఘనాథునితో సమానముగా బలవంతులు వచ్చి లక్ష్మణుని శరీరము నెత్తుటకు ప్రయత్నించిరి. కాని వారి ప్రయత్నములు నిష్ఫలమయ్యెను. కోట్లకొలది రాక్షసులు వచ్చిననూ అది సాధ్యము కానిది. కారణము ఆదిశేషుని ఎత్తుటకు తగిన బలవంతులు కలరా?! కడకు ఎందరు వచ్చిననూ లక్ష్మణుని దేహమును కదిలించలేకపోయిరి. శ్రీరాముని కటాక్షము కలవారే లక్ష్మణుని కదిలించగలరు.

ఇంతలో సాయంసమయమయ్యెను. ఉభయ సైన్యములు వారివారి కటకములకు నిష్క్రమించెను. శ్రీరాముడు వానర సైన్యమును చూచి లక్ష్మణుడేడి అని ప్రశ్నించెను. ఇంతలో హనుమంతుడు మూర్ఛిల్లిన లక్ష్మణుని దేహమును భుజములపై వేసుకొని, "రామా, రామా" అంటూ వచ్చెను. అతని రాకను గమనించి శ్రీరాముడు కొంత కంగారుపడినటుల నటించెను. హనుమంతుడు తెచ్చిన లక్ష్మణుని దేహమును తన తొడపై పరుండబెట్టుకొని అనేకవిధముల ఆ దేహమును పరీక్షించుచుండెను.

జాంబవంతుడు, "నాథా! కాలహరణము చేయక లంకలో వున్న సుషేణుడను వైద్యుని రప్పించుట మంచిద"ని కోరెను. ఈ మాట వినగానే హనుమంతుడు సూక్ష్మరూపమును ధరించి లంకలో ప్రవేశించెను. నేను పిలచిన సుషేణుడు వచ్చునో లేదో అని తనలో తాను తలంచి, యేమైననేమి అని సుషేణుని గృహమునే వూడబెరికి యెత్తుకొని వచ్చెను. సుషేణుడు రామునికి నమస్కరించి, ఔషధము పేరును, అది లభించు పర్వతము పేరును చెప్పెను. దీనిని తెచ్చుటకు తగిన వారెవ్వరు అని విచారించుచుండగనే హనుమంతుడు శ్రీరాముని చరణారవిందములకు నమస్కరించి అనుజ్ఞ యొసగమని కోరెను. రాముడు అనుమతి నిచ్చెను.

ఇంతలో సుషేణుడు రామసన్నిధిలో కలడను వార్త ఒక చారునిద్వారా రావణునకు తెలిసెను. రావణుడు కాలనేమికి తెలిపెను. అంత కాలనేమి, "రావణా! నీ కన్నెదుటనే వాడు నీ లంకను తగులబెట్టెను కదా! అట్టి హనుమంతుని నిరోధించుటకు నాకేమి శక్తి కలదు? ఇప్పటికైననూ మించిపోలేదు. శ్రీరాముని జయింతునన్న భ్రాంతిని నీవు వదులుము. శ్రీరాముని చరణముల నాశ్రయింపుము. అందువలన నీకు మేలు కలుగును. నీ అహంకారమును, మదమును విడిచిపెట్టుము" అని రావణునకు హితోపదేశము జేసెను. రావణుడు కోపించి వానిని ధిక్కరించెను. "నా ఆజ్ఞ ప్రకారము చేతువా లేక నిన్ను హతము గావించుమందువా" అని గర్జించగానే, కాలనేమి శ్రీరాముని చేతులలో చనిపోవుట మంచిది, వీని చేతులలో చచ్చుటెందులకని తలంచి ప్రయాణమయ్యెను.

వాడు మాయ పన్ని దారిలో నొక సరోవరమును కల్పించి, ఋషి వేషమును ధరించి ధ్యాననిష్ఠుడై కూర్చొనెను. హనుమంతుడు యుద్ధము నుండి విడిదికి వచ్చి విశ్రాంతియైననూ తీసుకొనక రామాజ్ఞను శిరసావహించి ఔషధము నిమిత్తమై పరువులిడినందున అలసిసొలసి దాహము వేసి దారిలో ఈ సుందర వనమును, ఆశ్రమమును చూచి దాహముగ్రోలి విశ్రమించి వెళ్ళుదమని ఆ ఆశ్రమములో ప్రవేశించెను; మునికి నమస్కరించెను. ఆ కపటవేషధారి శ్రీరాముని గుణగణములు గానముచేయ నారంభించెను. హనుమంతుడు ఆశ్చర్యపడి తానుకూడనూ రామ నామమును స్మరించెను. ఇంతలో కపటవేషధారియైన కాలనేమి, "వానరా, రామరావణులకు యుద్ధము జరుగుచున్నది. నిత్యము నేను ఇక్కడ నుండియే చూచుచున్నాను. తప్పక రామునకు విజయము కలుగును. ఇందులకు సందియము లేదు" అనెను. హనుమంతుడు ఆ వార్తతో సంతసించి తాను దాహముతో బాధపడుచుండినట్లు తెలుపుకొనెను. స్వర్ణకమండలములో చల్లని పానీయము కలదని చెప్పి నీటిని త్రాగుటకు హనుమంతునికి అందించెను. హనుమంతుడు, "స్వామీ, ఈ కొద్ది నీరు నాకేమాత్రము దాహమును తీర్చజాలదు" అని విన్నవించెను. కాలనేమి చెంతనే యున్న ఒక సరోవరమును చూపి, "అందులో నీ శ్రమతీరా స్నానము చేసి జలమును త్రాగిరమ్మ"ని చెప్పెను. ఆ మాటలకు హనుమంతుడు సమ్మతించి సరోవరములో చల్లని నీరు త్రాగనెంచి తన పాదములను సరోవరములో పెట్టెను. ఇంతలో ఒక మకరము వచ్చి అతని పాదములు పట్టెను. ఆ క్షణమే హనుమంతుడు ఆ మకరమును ఝుళిపించి చంపెను. మకరము శరీరమును విడిచి ఒక దివ్యపురుషునిగా ఎదుట నిలచెను. ఈ దృశ్యమును చూచి హనుమంతుడు ఆశ్చర్యపడి, "నీవెవడవు?" అని ప్రశ్నించెను. అంత ఆ మహాపురుషుడు, "ఓ రామదాసా! నీ దర్శన స్పర్శల వలన నా పాపము నశించెను. నా శాపము మరలెను. నేనును, కాలనేమియు పూర్వజన్మలో గంధర్వులము. దేవేంద్రుని సభలో గానము చేయుచుంటిమి. ఆ సమయమున దుర్వాసుడు అను మహాముని సభలోనికి వచ్చెను. అతని రూపురేఖలను చూచి నవ్వితిమి. అందుచేత నతడు కోపించి రాక్షసులై పుట్టుడని మమ్ములను శపించెను. మేము విచారించి అతని పాదములు పట్టి ప్రార్థించగా, "ఓయీ! మీరిరువురు రాక్షసులై లంకానగరములో జన్మించెదరు. త్రేతాయుగ చతుర్థపాదములో శ్రీరాముడవతరించును. అప్పుడు మీ లంకలో గొప్ప యుద్ధము జరుగును. ఆ యుద్ధములో శక్తి తగిలి లక్ష్మణుడు మూర్ఛిల్లును. సంజీవని పర్వతమును తీసుకొనివచ్చుటకై హనుమంతుడు ఆ మార్గమున వెళ్ళును. అతని వలన మీకు శాప విమోచన మగును" అని అతడు కరుణించి మాతో జెప్పెను. ఓ వీరుడా! సమీపముననున్న సుందర వనములో నివసించు ముని ముని కాడు. ముని వేషముతోనున్న రాక్షసుడు. అతడే కాలనేమి! నా మాట నమ్ముడు" అని గంధర్వుడు బోధించెను.

తదుపరి హనుమంతుడు కపటముని దగ్గరకు వచ్చి, "ఓ గురుస్వామీ! ప్రథమమున మీరు గురు దక్షిణను స్వీకరింపుడు" అనెను. నీరు త్రాగుటకై వెళ్ళిన హనుమంతుడు ఇంత ఆలస్యము చేయుటకు కారణ మేమని విచారించి, తన గుట్టును ఆ కొలనులో వున్న తన మిత్రుడు తెలిపెనేమో అని సందేహముతో విచారించుచున్న ఈ కపటమునియగు కాలనేమి తన చెంతకు వచ్చి నిలచిన హనుమంతుని చూచీ చూడనట్లుండెను. హనుమంతుడు వీని గుట్టును గుర్తించి తన వాలమును కన్నులు మూసి కూర్చొనియున్న ఆ కపట సన్యాసి మెడకు చుట్టి గిరగిర త్రిప్పి నేలగొట్టెను. ఆ కాలనేమి "రామా, రామా" అంటూ ప్రాణములు వీడెను.

(సశేషం)

స్వాతంత్ర్య దినోత్సవ సందేశం:

స్వారాజ్యసిద్ధి



ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన
    మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
    స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
    ధీశక్తి చూపిన దివ్యభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
    ప్రతిభ చూపించిన భరతభూమి
చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు జననమొంది
భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె బాలులార!

విద్యార్థులారా! భారతదేశ చరిత్రలో ఉత్కృష్టమైన ఆదర్శములు అనేకముగా కన్పిస్తున్నవి. ఫ్రెంచి, పోర్చుగీసు, మొగల్, అఫ్ఘాన్ ఇత్యాది విదేశీయులు పలుమార్లు భారతదేశంపైన దండెత్తి వచ్చి హెచ్చరించి నప్పటికీ భారతీయులు జాగ్రత్తపడలేక పోయారు. నిజాం సాహెబు సహాయంతో తాము కర్ణాటకను వశం చేసుకోగలిగినట్లు నాటి గవర్నరు డ్యూప్లెక్స్ తన చరిత్రలో లిఖించుకున్నాడు. అదేవిధంగా మీర్ జాఫర్ సహాయంచేత క్లైవ్ బెంగాల్ దేశాన్ని వశం చేసుకోగలిగాడు. అట్లే పీష్వా రఘునాథరావును లోబరుచుకొని మహారాష్ట్రమును వశపరచుకో గలిగారు. ఈవిధంగా ఆనాడు భారతదేశమును భారతీయుల సహాయంచేతనే విదేశీయులు తమ వశం చేసుకోగలిగారు.

అనైక్యతే బలహీనత

భారతదేశంలో శౌర్య ధైర్య పరాక్రమవంతులు లేకపోలేదు. నాగరికతయందుకాని, విజ్ఞానమునందుకాని, విశిష్టతయందుకాని, పేరుప్రతిష్ఠలయందుకాని, ధనమునందుకాని ఏ దేశమునకూ భారతదేశం తీసిపోదు. కానీ భారతదేశమునందు ఐకమత్యం లోపించింది. కనుకనే, పదివేల మైళ్ళ దూరమునుండి వచ్చిన ఆంగ్లేయులు తమ దేశముకంటే 16 రెట్లు పెద్దదైన, 8 రెట్లు అధిక జనాభా కలిగిన భారతదేశమును ఒకటి కాదు, పది కాదు, 190 సంవత్సరములు వశము చేసుకోగలిగారు. దేహమునకుగాని, దేశమునకుగాని ఐకమత్యము అత్యవసరము. ఐకమత్యమే మహాబలము. బలహీనులను ఎవరైననూ జయించగలరు.

1893వ సం॥లో ఒక వ్యాపారికి సంబంధించిన కేసు విచారణ నిమిత్తమై గాంధీ దక్షిణాఫ్రికా వెళ్ళాడు. అప్పటికి గాంధీ వయస్సు 24 సంవత్సరాలు. దక్షిణాఫ్రికాలో భారతీయులకు జరుగుతున్న అవమానాలు, హింసలు కనులార చూసాడు. మానవునకు, మానవునకు మధ్య భేదమేమిటి! రంగులు, ఆశయాలు, అధికారాలు. విద్యలయందు వ్యత్యాసములుండవచ్చుకానీ మానవత్వము మానవత్వమే కదా! ఒక మానవుడు తోటి మానవుని హీనంగా చూడటం న్యాయంకాదని అక్కడ సత్యాగ్రహం ప్రారంభించాడు. అధికారులు ఈ వార్తను అక్కడి ప్రధానమంత్రియైన జనరల్ స్మట్స్‌కు అందజేశారు. అతను గాంధీని పిలిపించి, "మిత్రమా! శ్వేత జాతీయులు భారతీయులను హింసించడం నిజమే. మరి మీ

భారతదేశమునందు మీ భారతీయులనే కొన్ని కోట్లమందిని గ్రామములకు వెలుపల ఉంచి అంటరానివారుగా చూస్తున్నారే! అలాంటప్పుడు మీకు మా దోషములను చూపే అధికారమెక్కడున్నది!" అని ప్రశ్నించాడు.

గాయపడిన గాంధీ హృదయం

స్మట్స్ అన్న మాటలు గాంధీ హృదయానికి తుపాకి గుండ్లవలె తాకినవి. గాంధీ తలవంచుకొన్నాడు. నిజంగా పరుల దోషములను ఎంచే అధికారము తమకెక్కడున్నది? ఈవిధమైన సత్యవిచారణచేత పరిణామము చెందినవాడు గాంధీ. ఎవరైనా తమ దోషములను, బలహీనతలను ఎత్తి చూపినప్పుడు వాటిని సరిదిద్దుకొనువారే నిజమైన మానవులు. గాంధీ ఈ విషయమునందు ఆదర్శమూర్తి కావటంచేతనే యావద్భారత దేశం అతనిని జాతిపితయని కీర్తిస్తున్నది.

దక్షిణాఫ్రికా అనుభవంతో గాంధీ భారతదేశానికి బయల్దేరి వచ్చాడు. అంటరానితనమును దూరంచేసి, తదుపరి దేశ స్వాతంత్ర్యానికి తగిన ప్రయత్నాలకు పూనుకుందామని సత్యాగ్రహం ప్రారంభించాడు. భారతీయులందరూ ఒక్కటే. అందరూ సోదరత్వాన్ని పెంపొందించుకోవాలి. జాతి మత కుల భేదములను నిర్మూలము గావించాలి. మొట్టమొదట ఈవిధమైన ఆశయములతో గాంధీ ప్రవేశించాడు. ఇది క్రమక్రమేణా పెరిగి పెద్ద వృక్షంగా మారిపోయింది. అనేక కష్ట నష్టములకు, దుఃఖములకు, ప్రాణాపాయములకు కూడా వెరువకుండా గాంధీ తన సత్యాగ్రహోద్యమాన్ని సాగించాడు. 'నాయమాత్మా బలహీనేన లభ్యః' అన్నట్లుగా బలహీనుడైనవాడు దేనినీ సాధించలేడు. ఆత్మబలము కలవాడు దేనినైనా సాధించగలడు. కనుక మొట్టమొదట మనం ఆత్మవిశ్వాసమును బలపరచుకోవాలి. విశ్వాసము లేనివానికి ప్రేమ కలుగదు. ప్రేమ లేనివానికి శాంతి లభించదు. శాంతి లేనివాడు సత్యమార్గంలో ప్రవేశించడు. సత్యమార్గంలో ప్రవేశించనివానికి ఆనందము శూన్యము. ఆనందమును అనుభవించాలంటే సత్యమార్గంలో ప్రవేశించాలి. విశ్వాసమున్నచోట ప్రేమ ఉంటుంది. ప్రేమ ఉన్నచోట శాంతి ఉంటుంది. శాంతి ఉన్నచోట సత్యం ఉంటుంది. సత్యమున్నచోట ఆనందముంటుంది. ఆనంద మున్నచోట భగవంతుడు ఉంటాడు.

దైవత్వాన్ని పొందాలనుకున్నప్పుడు, సర్వ మానవ సోదరత్వాన్ని పెంపొందించుకోవాలనుకున్నప్పుడు ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. కాని భారతదేశములో మొదటి నుండి ఐకమత్యము కుంటుపడుతూ వచ్చింది. స్వార్థము, స్వార్థము, స్వార్థము! లౌకికమునందు స్వార్థమే, ఆధ్యాత్మిక విజ్ఞానములందు కూడా స్వార్థమే! స్వార్థమనే పిశాచంచేత పీడించబడుతున్నారు భారతీయులు. 'స్వార్థము' చేతిలో కీలుబొమ్మలై ఆడుతున్నారు. ఈ స్వార్థమునకు దైవమును కూడా వినియోగించుకోవటానికి ప్రయత్నిస్తుంటారు. ఈ స్వార్థ స్వప్రయోజనముల బంధనలో చిక్కుకోవటంచేతనే మానవత్వాన్నికూడా మరచిపోయి, దానవులుగా తయా రవుతున్నారు. కనుకనే, స్వార్థత్యాగంద్వారా పరార్థమైన ఐకమత్యాన్ని అభివృద్ధిపరచాలని గాంధీ అనేకవిధములుగా ప్రయత్నించాడు.

"కష్ట సుఖములు రెండును కలసియుండు"

మంచికార్యములందు ప్రయత్నము దిగ్విజయము సాధిస్తుంది. ప్రారంభంలో కొన్ని కష్టనష్టములు కలుగ వచ్చు. కష్టపడక సుఖాన్ని అనుభవించలేము. ప్రకృతిలోని ప్రతి పదార్థము కూడా మానవునికి ఈ విషయమును బోధిస్తూనే ఉన్నది. గులాబి పుష్పము చాలా అందంగా ఉంటుంది. ఎంతో ఆనందాన్నిస్తుంది. సుగంధాన్ని వెదజల్లుతుంది. కానీ క్రిందనున్న పదునైన ముండ్లతో బాధను కలిగించేవిధంగా మానవుని భయపెడుతుంది. ముండ్లులేనిది రోజా పుష్పమే లేదు, పువ్వు ప్రేమస్వరూపం కాగా, ముల్లు వాంఛకు పరాకాష్ఠ! ముల్లును ముట్టకుండా గులాబి పుష్పాన్ని కోయాలి. ఈవిధంగా గులాబి మొక్క మానవునకు చక్కని గుణపాఠం నేర్పుతున్నది. సుఖమును అనుభవింపగోరిన మానవుడు దుఃఖానికి సిద్ధంగా ఉండాలని ఇది బోధిస్తుంది. దైవత్వాన్ని పొందదలచినవాడు మానవ జీవితంలో ఉన్న బాధలను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. రెండింటికీ సిద్ధంగా ఉండాలి. బాధలు లేకుండా, కష్టనష్టములు లేకుండా దైవత్వం పొందగోరడం సోమరుల లక్షణం, కాలు గడప దాటకుండా, కాసు ఖర్చు

కాకుండా కైవల్యం ఒడిలో పడాలి ఈనాడు మనకు! ఇవి సోమరుల భావములే కాని సరైన భక్తుల భావములు కానేరవు. కనుకనే గాంధీ త్యాగములకు సిద్ధమై అనేక ప్రయత్నములు సలిపి దేశానికి విముక్తిని సాధించాడు. ఆగస్టు 14 అర్ధరాత్రి భారత దేశ స్వాతంత్ర్య ప్రకటన చేశారు.

ఆత్మానుసరణే స్వాతంత్ర్యం

స్వతంత్రమంటే ఏమిటి? ఇతరుల స్వాధీనంలో ఉండటం పరతంత్రం. ఎవ్వరి అధీనంలో కూడా లేకుండా ఉండటం స్వతంత్రం. 'పరాధీనం దుఃఖం, ఆత్మాధీనం సుఖం' అన్నారు. నీ హృదయాన్ని నీవు అనుసరించడమే స్వాతంత్ర్యం. హృదయమే నీ గురువు. హృదయమే నీ దైవం. హృదయాన్ని అనుసరించినప్పుడే విజయాన్ని సాధిస్తావు. ఇదే దైవాన్ని అనుసరించమని బోధించడం.

యంత్రము దేహము, మంత్రము శ్వాసము, తంత్రము హృదయము. యంత్ర మంత్ర తంత్రముల సమ్మిళిత స్వరూపమే మానవత్వము. ఈనాడు పరదేశీయుల పరిపాలననుండి మాత్రమే విముక్తిని పొందగలిగాము. విదేశీయుల బంధన మాత్రమే బంధన కాదు. స్వబంధన నుండి కూడా విముక్తి పొందాలి! ఇంద్రియముల అధీనములో ఉండటమే స్వబంధన. స్వబంధననుండి కూడా విముక్తుడైనప్పుడే స్వతంత్రుడవుతాడు. బాహ్య స్వాతంత్ర్యం, అంతర్ముఖ స్వాతంత్ర్యం - ఈ రెండింటిని పొందినవాడే నిజమైన మానవుడు.

నిజముగా మానవుడు స్వాతంత్ర్యము పొందా లనుకుంటే ఇంద్రియ నిగ్రహ ప్రాధాన్యాన్ని, దైవ సత్యత్వాన్నీ, మానవత్వ విశాలత్వాన్నీ గుర్తించడానికి ప్రయత్నించాలి. దీనినే పతంజలి తన యోగశాస్త్ర సూత్రములలో 'యోగః చిత్తవృత్తి నిరోధః' అని చెప్పాడు. మనస్సును నిగ్రహించవచ్చునని అందరూ చెప్పవచ్చును కాని, నిగ్రహించే శక్తి అందరికీ ఉండదు.

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ ప్రాంగణంలో విద్యార్థులకు, అధ్యాపకులకు భగవాన్ తమ దివ్యసందేశం అనుగ్రహిస్తున్న దృశ్యం (15.8.1985)

దైవంతో ఏకత్వం

విద్యార్థులారా! మీరు భావిభారతోద్ధారకులు. కనుక ఈనాటి నుండైనా ఐకమత్యాన్ని అభివృద్ధిపరచుకొని, సోదరత్వాన్ని పెంపొందించుకొని మానవత్వాన్ని ప్రకాశింప జేసుకొని, దైవత్వాన్ని పొంది ఆనందాన్ని అందుకుంటారని నేను ఆశిస్తున్నాను. మొదలు మీరు పవిత్రతను అభివృద్ధి చేసుకోండి. మీలో పవిత్రత పెరిగినప్పుడు సహజంగా అందులోనే దివ్యత్వం ప్రత్యక్షమవుతుంది. భగవంతునితో ఏకత్వం సాధించాలి. ఈ ఏకత్వాన్ని ముందు సాధిస్తే తక్కినవన్నీ సహజంగానే చేరిపోతాయి. ఈవిధంగా భారతదేశం ఏకం కావడమే కాకుండా సమస్త లోకములు కూడా సుఖంగా వుండాలని పిల్లలు ఆశించాలి. 'సమస్త లోకాస్సుఖినో భవంతు'. కేవలం భారతదేశమేకాదు, సర్వదేశములు కూడా సుఖంగా ఉండాలని మనం ఆశించాలి.

ప్రపంచమంతా బాగున్నప్పుడే భారతదేశం కూడా బాగుంటుంది. భారతదేశం బాగున్నప్పుడే ఆంధ్రప్రదేశం బాగుంటుంది. ఆంధ్రప్రదేశం బాగున్నప్పుడు అనంతపురం జిల్లా బాగుంటుంది. అనంతపురం జిల్లా బాగున్నప్పుడు పుట్టపర్తి కుగ్రామం బాగుంటుంది. పుట్టపర్తి క్షేమంగా

ఉన్నప్పుడే మన ఇల్లు కూడా క్షేమంగా వుంటుంది. మన క్షేమమంతా యావత్ప్రపంచ క్షేమంపైన ఆధారపడి వుంటుంది. కనుక పిల్లలైన మీరు స్వార్థ సంకుచిత ప్రేమను కాకుండా విశాలమైన ప్రేమ నభివృద్ధిపరచుకొని భారతదేశమే గాక యావత్ప్రపంచమూ సుఖశాంతులతో వుండాలని ప్రార్థిస్తూ దానికి తగిన ప్రయత్నాలు చేయగలరని ఆశిస్తున్నాను. ఏకత్వాన్ని ఒక దైవత్వంతో తప్ప అన్యమార్గంలో మనం సాధించలేము. అన్నీ మార్పుచెందేవే కాని ఒక్క దైవత్వం మాత్రమే ఎప్పటికీ మార్పుచెందనిది. మార్పుచెందని ఆత్మను అనుసరించి నప్పుడే దేశమంతా క్షేమంగా వుంటుంది.

విద్యార్థులారా! ఈ పతాకము విజయమునకు ఒక గుర్తు. అయితే ఇది ఒక దేశమునకు మాత్రమే చెందినది. దీనిని జాతీయ పతాకమన్నారు. అన్ని దేశములకు సంబంధించినది కాదు. కాని మన హృదయ దిగ్విజయము సర్వదేశములకు సంబంధమైన పతాకము, కనుకనే హృదయ దిగ్విజయాన్ని సాధించే మార్గంలో పోరాటం సలుపండి. మీరు ఆదర్శమూర్తులై భారతీయులయొక్క శక్తిసామర్థ్యములు ఇట్టివని యావత్ప్రపంచానికి నిరూపించాలని ఆశీర్వదిస్తున్నాను.

(15.8.1985 నాటి దివ్యోపన్యాసము,
ప్రశాంతినిలయము)

శ్రీ సత్యసాయి పద్యసుధ:

"భరత సంస్కృతి నెలకొల్పవలయు నేడు"

పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
సంస్కృతమడుగంటి సన్నగిల్లె
పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
పరిణయ ధర్మముల్ వమ్ములయ్యె
పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
ఆర్యధర్మములెల్ల ఆరిపోయె
పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
వేషభాషలయందు మోజు హెచ్చె
తల్లి భాషను మాట్లాడ తప్పుదోచె
సంఘమర్యాద పాటింప జంకు పుట్టె
ధర్మమన్నది బోధింప తప్పిపోయె
ఇట్టులైనది భారతజాతి నేడు.

బాలబాలికలెల్లరు భవ్యమైన
దివ్యవిద్యల నేర్వగ దీక్షబూని
భరత సంస్కృతి నెలకొల్పవలయు నేడు
భక్తి క్రమశిక్ష మనసున పాదుకొల్పి.

ప్రాచీన ఋషులకు పాఠముల్ నేర్పింప
జాలిన వేదాంతసారమతులు
నిర్జీవశిలలచే నృత్యమాడించెడి
నేర్పుగల్గిన కళానిపుణమతులు
పరవీర శిరములు బంతులాడించుచు
క్రీడింపగలిగిన వాడి మగలు
సర్వసర్వంసహాచక్రపాలన జేసి
నడిపించగలిగిన నాయకులును
కలరు భారతభువిని పెక్కండ్రు నేడు
ఉండి ఫలమేమి, వారిలో నొక్కడైన
అనుదినంబును వినిపించు ఆర్తరవము
ఆలకింప దలంపరో ఆర్యులార!

యుగ యుగాంతములనుండియు నుర్విపైన
ఖ్యాతి గన్నట్టి భరత భూమాత కీర్తి
సాయి సిద్ధాంతములచేత సానబట్టి
వన్నె పెట్టుడు మీరిక సున్నితముగ ❖

శ్రీ సత్యసాయి సేవాసంస్థల కోవిడ్-19 సేవలు (తెలంగాణ)

❖ పి. వెంకట్రావ్, శ్రీ సత్యసాయి సేవాసంస్థల తెలంగాణ అధ్యక్షులు ❖

సాయి అర్థించు మీనుండి సద్గుణములు
సర్వమానవ సోదర సఖ్యబుద్ధి
స్వార్థత్యాగంబు పరిశుద్ధ సంఘసేవ
సాయికిచ్చెడి ధనమిదె సత్యముగను

- శ్రీ సత్యసాయి

నిస్వార్థ సేవయే భగవదనుగ్రహమునకు రాచబాట అన్న స్వామివారి దివ్యసందేశ స్ఫూర్తితో, ఈ కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ, స్వామివారి అనుగ్రహమే దివ్యరక్షణ కవచంగా తెలంగాణ రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థలు ఈ క్రింది సేవలను చేయడమైనది.

1). క్షుద్బాధ తీర్చే సేవలు: 'లాక్‌డౌన్' అమలు అవుతున్న తరుణంలో, సడలింపు కేవలం నాలుగు గంటలకు మాత్రమే పరిమితమైన రోజులలో, 'కోవిడ్' బారినపడి 'హోం ఐసొలేషన్'లో ఉన్నవారికి, ముఖ్యంగా ఒంటరిగా ఉన్నవారికి ఆహారం లభించడం ఎడారిలో

గంగాజలం దొరికినట్టేనని చెప్పవచ్చు. ఇట్టి పరిస్థితుల్లో గ్రేటర్ హైదరాబాద్ మహానగర పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలవారు మరియు ఇతర ప్రదేశాలలో అన్ని జిల్లాలవారు అవసరం ఉన్న కోవిడ్ బాధితులకు అమృతతుల్యమైన ఆహార ప్రసాదాన్ని ప్రేమతో అందించారు.

ఈ క్రింది ఉదాహరణను పరిశీలిస్తే, లబ్ధిదారులు ఈ సేవద్వారా ఎంతటి ప్రేరణ పొందారో తెలుస్తుంది.

'హోం ఐసొలేషన్'లో ఒంటరిగా ఉండి పూర్తిగా నీరసించిన ఒక వ్యక్తి 'లాక్‌డౌన్'లో హోటళ్ళు లేక, సాయిసంస్థ హెల్ప్ లైన్ నంబర్ చూసి ఫోనులో సహాయం అడగగానే, మన సేవాదళ్ సభ్యుడు గంటలో ఆహారం తయారుచేసి, 30 కిలోమీటర్లు బైక్‌పై వెళ్లి అందించగా ఆ వ్యక్తి ముఖంలో కనపడిన ఆనందం, కృతజ్ఞతాభావం వర్ణనాతీతం. 'నేను కోలుకున్న తర్వాత తప్పకుండా శ్రీ సత్యసాయి సేవాసంస్థలద్వారా సేవల్లో పాల్గొని నా జన్మను ధన్యం చేసుకుంటాన'ని అతను కృతజ్ఞతలు తెలుపుకోవటం నిస్వార్థసేవ ఎంతటి అద్భుత పరివర్తనకు దోహద పడుతుందో తెలిపే ప్రత్యక్ష నిదర్శనం.

ఈ 'లాక్‌డౌన్' సమయంలో తెలంగాణ రాష్ట్రం 21 జిల్లాలలోని మన సమితులలో 37 కమ్యూనిటీ కిచెన్‌లు ఏర్పాటు చేసుకుని 7,78,621 మందికి ఆహార ప్రసాదం అందించడమైనది. 41,506 పళ్ళు; 1,26,886 మజ్జిగ / మంచినీటి పాకెట్లు, 40 టన్నుల కూరగాయలుకూడా పంపిణీ చేయడమైనది.

2). పోలీసులకు, ప్రభుత్వ అధికారులకు సేవలు: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విధినిర్వహణలో ఉన్న పోలీసులకు, అధికారులకు ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందించడమైనది. ఆసుపత్రులలో సిబ్బందికి మరియు రోగుల సహాయకులకు పలుచోట్ల ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా ఆహారాన్ని అందించడమైనది.

3). రైల్వేస్టేషన్‌లో వేచియున్న ప్రయాణికులకు: లాక్‌డౌన్ నిబంధనలవలన, రాత్రి 11 గంటలకు రైలు

ఎక్కవలసిన ప్రయాణికులు సహితం ఉదయం పది గంటలలోపే రైల్వేస్టేషన్ చేరుకోవాల్సిన పరిస్థితి! ప్రయాణికుల అవస్థను గమనించి అధికారులు చేసిన అభ్యర్థన మేరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 1000 మందికి, రాత్రిపూట 500 మందికి రుచికరమైన పౌష్టికాహారం అందించటం కేవలం శ్రీ సత్యసాయి అన్నపూర్ణేశ్వరి అనుగ్రహంతోనే సాధ్యమైంది. రెక్కాడితేగానీ డొక్కాడని రోజువారీ కూలీలకు, లాక్‌డౌన్‌లో నిలిచిపోయిన వేలాది వలస కూలీలకు ప్రతి రోజూ ఆహారం అందించడమైనది.

4). అమృతకలశములు (నెలకు సరిపడా ఆహార దినుసులు): 'లాక్‌డౌన్'తో ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల అధ్యాపకులకు; అర్చకులకు, రోజువారీ కూలీలకు మొత్తం 25,186 మందికి శ్రీ సత్యసాయి అమృత కలశములద్వారా సాయి ఆపన్నహస్తం అందించినట్లయినది. ఇంతేగాక, వివిధ రాష్ట్రముల నుండి వచ్చిన వలస కార్మికులకుకూడా 9,254 అమృత కలశములు పంపిణీ చేయడమైనది.

5). 'శ్రీ సత్యసాయి ప్రాణమిత్ర' – టెలీ మెడిసిన్ సేవలు: 2020 ఆగస్టు 29వ తేదీన శాశ్వత ప్రాతిపదికన ప్రారంభించబడిన ఈ సేవాకార్యక్రమంలో భాగంగా ప్రతి శని, ఆది వారాలలో 080-47179797 ద్వారా డాక్టర్ల సలహాలు అందించబడుతున్నాయి. నిపుణులైన 70 మంది డాక్టర్లు ఇందులో సేవలందిస్తున్నారు. ఇప్పటివరకు 2,500 మంది లబ్ధి పొందారు. ఈ ఆన్‌లైన్ మెడికల్ సేవలతోపాటు, ప్రత్యేకించి ఈ 'కోవిడ్' సమయంలో ఐదుగురు వైద్యనిపుణులు వారం పొడవునా రోజుకు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటూ తమ అమూల్యమైన సలహాలు అందిస్తున్నారు.

6). ఆన్‌లైన్ హెల్ప్‌లైన్: శ్రీ సత్యసాయి యువత మరియు శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ పూర్వవిద్యార్థుల సంయుక్త సహకారంతో సెంట్రల్ హెల్ప్‌లైన్ 040-48213333 ఏర్పాటు చేసి, అవసరమైనవారికి ఆహారము, సాధారణ కోవిడ్ మందులతోపాటు టెలీ మెడిసిన్‌ద్వారా డాక్టర్ల సలహాలు, సూచనలు అందించటం జరిగింది. ఆసుపత్రులలో ఖాళీ పడకల లభ్యత, ఆక్సిజన్ సిలిండర్ల, ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల లభ్యత మొదలగు వివరములు తెలుపు సేవలను 350 మందికి పైగా శ్రీ సత్యసాయి యువత అందించగా దాదాపు 2,300 మంది లబ్ధి పొందినారు.

7). ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, కోవిడ్ మెడికల్ కిట్స్, హోమియో మందుల పంపిణీ: ఇంటివద్ద చికిత్స పొందుతూ ఉన్నవారికి, డాక్టర్ సలహా ప్రకారం ఆక్సిజన్ అవసరం ఉన్నవారికి ఇంటివద్దకే ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందజేయటం జరిగింది. తెలంగాణలో మొత్తం 72 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు సేవలో వినియోగింపబడుతున్నవి. ఖమ్మం జిల్లాలో ఒక ఆక్సిజన్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయడం జరిగింది. సాధారణ కోవిడ్ మెడికల్ కిట్స్,

హోమియో మందులు వేలాదిమందికి అందించడమైనది. ఇంతేగాక, సేనిటైజర్లు - 200, పి.పి.ఇ. కిట్స్ - 200, కోవిడ్ మందుల కిట్స్ - 599 పంపిణీ చేయడమైనది.

8). 41 రోజుల సాధనా యజ్ఞం: సామూహిక ప్రార్థనల వలన ఎంతో మహత్తర ఫలితం సాధించవచ్చు నన్న స్వామివారి దివ్యబోధను అనుసరించి, రాష్ట్రవ్యాప్తంగా 41 రోజులు (01-05-2021 నుండి 10-06-2021 వరకు) నిర్వహింపబడిన సాధనాయజ్ఞంలో 5000 మంది భక్తులు పాల్గొని, లోకశ్రేయస్సును కాంక్షిస్తూ, అత్యంత మహిమాన్వితములైన శ్రీ గాయత్రీ, శ్రీ సాయిగాయత్రీ మహామంత్రములను 7 కోట్ల 61 లక్షల పర్యాయములు భక్తిశ్రద్ధలతో పారాయణం చేసినారు.

9). పశు ఆహార మరియు వైద్యసేవలు: 150కి పైగా పశువైద్యశిబిరములలో 34,872 పశువులకు చికిత్స అందించడమైనది. 1500 కేజీల పశు ఖనిజ మరియు లవణ గ్రాసమును వివిధ జిల్లాలలోని పశువులకు, గోశాలలకు ఇవ్వడం జరిగినది. గోశాలలకు (సుమారు 2,550 గోవులకు) ప్రత్యేకంగా 10 టన్నుల దాణా కూడా ఇవ్వడం జరిగినది. పశువులకు ద్రవ మేత సుమారు 500 లీటర్లు ఇవ్వడం జరిగినది. ఈ సేవలు మేడ్చెల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 71 గ్రామములలో నిర్వహింపబడినవి.

10). శ్రీ సత్యసాయి యువత సేవాసాధన: ప్రభుత్వము మరియు మన సంస్థ నిర్దేశించిన ముందు జాగ్రత్త చర్యలు/ మార్గదర్శకాలకు కట్టుబడి సేవాసమితులు ఆహారాన్ని తయారుచేసి డెలివరీ ఛానెల్స్ / శ్రీ సత్యసాయి యువతద్వారా పంపిణీ చేయడమైనది. కోవిడ్-19పై అవగాహన సదస్సులు మరియు విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు యువతకోసం ప్రత్యేక ఆన్‌లైన్ సమావేశములు ఏర్పాటుచేసి నిపుణులైన వక్తలచే ఉత్తేజకరమైన ప్రసంగాలు అందించటం జరిగినది.

11). సాయి జననీ - గిరిజనప్రాంత సేవలు: కొమరంభీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి ఆదిలాబాద్, భూపాలపల్లి జిల్లాల్లోని 40 గిరిజన గ్రామాలలో 667 అమృత కలశములు ఇవ్వడం జరిగినది. వస్త్రములు - 550, గొడుగులు - 151, పాదరక్షలు -

201, వర్షం తాకిడి తట్టుకునే ఇంటి పైకప్పులు - 82, చిన్నపిల్లలకు సాయిప్రొటీన్ పౌడర్ - 960 కిలోలు పంపిణీ చేయడమైనది.

12). మహిళా విభాగంవారి సేవాసాధన: ఈ సేవా అవకాశమును సద్వినియోగం చేసుకొని మహిళా విభాగంవారు ప్రతి రోజు తమ ఇంట్లో, లేక, సమితియందు కోవిడ్ బాధితులకు మరియు వారి కుటుంబ సభ్యులకు పౌష్టికాహారమును - అన్నప్రసాదమును తయారుచేసి పంపినారు. ప్రతి నెలా మహిళా దినోత్సవంనాడు 600 అమృతకలశములు అందించినారు. 1,20,500 మాస్కులు భక్తి శ్రద్ధలతో తయారుచేసి పంపిణీ చేసినారు.

> **"అహల్యవంటి రాయి, రామపాదంవంటి పాదం రెండూ చేరినప్పుడే శాపవిమోచనం. అట్లే, సత్యసాయి వంటి ప్రభువు, సాయిభక్తుల వంటి సేవకులు ఉన్నప్పుడు ఎన్ని కష్టాలైనా నివారణ కాగలవు"**

అన్న దివ్యవాక్కులను మరోమారు స్ఫురణకు తెచ్చిన ఈ సేవాసుమమాలను స్వామివారి దివ్యచరణారవిందముల చెంత వినమ్రతతో ప్రేమపూర్వకంగా సమర్పిస్తున్నాము. ❖



సద్విద్య - పంచప్రాణములు:

ఆదర్శ అధ్యాపకుడు

(గత సంచిక తరువాయి)

❖ కూర్పు: ఆర్. సీతాలక్ష్మి ❖

ప్రపంచానికి కావలసిన ప్రధాన ప్రాతిపదికలు వస్తూత్పత్తిచేసే ఉత్పత్తి శక్తి, ఉత్పత్తి చేసిన వస్తువులను సంరక్షించవలసిన రక్షకశక్తి. ఈ రెండింటిలో తగిన తర్ఫీదు నందివ్వవలసిన శిక్షకశక్తి. ఈ ముగ్గురు అన్యోన్య ఆశ్రితులు.

అయితే, సమాజంలో అగ్రస్థానం అధ్యాపకునిదే (శిక్షకశక్తి). పాలకులు కేవలం తమ పాలనాసంబంధమైన కర్తవ్యాలను నిర్వర్తిస్తారు. కానీ పాలకులను కూడా తయారుచేయవలసినవారు అధ్యాపకులే. ఈ జగత్తు సంక్షేమము అధ్యాపకుల భావ రాగములపైన ఆధారపడి ఉంటుంది. అధ్యాపకుని స్థానము ఉత్తమ స్థానము. విజ్ఞానశాస్త్రవేత్తలను, రాజకీయవేత్తలను, జీవితరంగంలో ఉన్న ప్రతి ఉన్నత పదవిని అలంకరించే వ్యక్తులనూ తయారుచేయువారు అధ్యాపకులే. ఈ సత్యాన్ని లోకానికి చాటిన మహోన్నత నాయకుడు బాలగంగాధర తిలక్. ఆయన పూనాలో లెక్కల టీచరుగా ఉండేవాడు. రాజకీయంగా గొప్ప సేవలు సలిపిన మహావ్యక్తి. సేవలో ఆదర్శమూర్తి. స్వరాజ్యం వచ్చిన తర్వాత మిత్రులు, "నీవు ఏ మంత్రివి అవుతావ"ని అడిగారు. "నాకు ఏ మంత్రి పదవీ అక్కరలేదు. ఉత్తమ మంత్రులుగా విద్యార్థులను తయారుచేసే నాకు మంత్రి పదవి ఎందుకు?! అధ్యాపకునిగా ఉంటూ బాధ్యతగల పౌరులుగా విద్యార్థులను తయారుచేయడమే నా అభీష్టమ"న్నారు.

మానవజాతియొక్క గౌరవముగాని, శక్తిసామర్థ్యములు గాని అధ్యాపకుల గుణముపై ఆధారపడి ఉంటాయి. మానవత్వమునకు గుణమే గీటురాయి. అన్నము నిమిత్తమే కాక ఆదర్శము నిమిత్తమై జీవించుటయే గుణము. కేవలం ధన నిమిత్తమే అధ్యాపకుడు బోధించడం, కేవలం ఉద్యోగ నిమిత్తమే విద్యార్థులు విద్య నభ్యసించటం మంచి పద్ధతి కాదు. అధ్యాపకులు విద్యార్థియొక్క ఔన్నత్యమును, అభివృద్ధిని ఆశించి తమ కర్తవ్యమును గుర్తించి వర్తించాలి. మానవత్వాన్ని వికసింపజేసుకొని సామాజికసేవయందు, దైవమార్గమునందు మార్గదర్శకులుగా నిలవాలి. ఇష్టపూర్వకముగా ఈ వృత్తిని స్వీకరించినారు కనుక తమ శక్తిమేరకు బాధ్యతను త్రికరణశుద్ధితో నెరవేర్చాలి. తమపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉంచిన నమ్మకమును వమ్ము చేయక నీతి నిజాయతీలతో తమ కర్తవ్యమును చేపట్టాలి. ముందుగా తమ ప్రవర్తనను పరిశీలించుకోవాలి. అధ్యాపకులు సత్ప్రవర్తన కలిగియుంటే పిల్లలుకూడా వారిని అనుసరిస్తారు. ప్రాథమికస్థాయిలో బాలబాలికలకు అన్నింటియందు ఆదర్శమును అందివ్వగలిగే వ్యక్తి ఒక్క అధ్యాపకుడే. విద్యార్థులను ప్రేమపుత్రులని భావించి ప్రేమతో ఆకర్షిస్తే విద్యార్థులు వారిని ఆరాధిస్తారు.

ప్రపంచానుభవం లేని వేలాదిమంది లేతహృదయులు అధ్యాపకుని సంరక్షణలో ఉంటారు. అధ్యాపకుని ఉపదేశముల ప్రభావం వారిమీద ఎంతో ఉంటుంది. అధ్యాపకునిలో దుర్గుణములూ, దురలవాట్లూ ఉంటే పిల్లలు చెడిపోయే ప్రమాదముంది. తత్ఫలితంగా సమాజం చెడిపోతుంది. కాబట్టి, అధ్యాపకుల ప్రవర్తనారీతులు, అలవాట్లు ఆదర్శవంతంగా వుండాలి. కొందరు పొగత్రాగరాదని, వారే సిగరెట్లు త్రాగుతారు. తన కోపమె తన శత్రువని చెప్పి తామే విద్యార్థులను అనవసరంగా కోప్పడుతారు. తమ విద్యార్థులు ఆదర్శమానవులుగా ఉండాలంటే ముందు అధ్యాపకులే ఆదర్శముగా వుండాలి.

"నీతి నియమాలు నరునికి ఖ్యాతి గూర్చు
బాల్యదశయందె యియ్యవి పట్టుబడును
ఇట్టిరీతుల తెలిపెడునట్టి జనుల
నేరి అధ్యాపకుల నొనరించరయ్య" - *బాబా*

అధ్యాపకుని ఆచార్యుడు అనికూడా అంటారు. అనగా ఆచరించి చెప్పువాడు. కాన ఆ స్థితికి రావాలి అధ్యాపకులు. అధ్యాపకులందరూ 'డ్రిల్ టీచర్' మాదిరి వుండాలి. అతనిని 'ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్' అంటారు. అతడు బోర్డుపైన వ్రాసి బోధించడు. 'వన్, టు, త్రీ, ఫోర్' అంటూ ఎక్సర్‌సైజులను తాను చేసి చూపిస్తాడు. అదేవిధంగా ఏ సద్గుణములను పిల్లలకు బోధించాలని అనుకుంటున్నారో వాటిని మొదట అధ్యాపకులు స్వయంగా ఆచరించాలి. చెప్పినవాటిని ఆచరించకపోతే ఆ బోధన 'ఆర్టిఫిషియల్'గా ఉంటుంది. 'హార్ట్‌ఫీల్'గా ఉండదు.

"బ్రహ్మ సృష్టిచేయు బ్రహ్మాండమునెల్ల
విష్ణువన్ని పెంచి వృద్ధిచేయు
పరమశివుడు త్రుంచు పాపిష్టి జీవుల
గురువు మూడు క్రియలు సలుపు నొకడె!" - *బాబా*

విద్యార్థులు ఏ కొద్దికాలమో విద్యనభ్యసిస్తారు. విద్యాబోధకులగుటకు అధ్యాపకులు మాత్రం నిరవధిక విద్యార్థులుగా వుండాలి. అధ్యాపకుడే శాశ్వత విద్యార్థి. అతను నిరంతరం వెలిగే జ్యోతివంటివాడు. జ్యోతి వెలుగుతుండాలి. అంటే తైలమును పోస్తుండాలి. వత్తిని సరిచేస్తుండాలి. అటులనే అధ్యాపకుడు ఎప్పటికప్పుడు బోధనాంశములను నిత్యనూతనంగా, ఆసక్తికరంగా వుండేటట్లు తయారుచేసుకోవాలి. పాతభావములను సరిజేసుకోవాలి. అంతేగాని చెప్పిందే చెప్పుకుంటూ బోర్ కొట్టకూడదు.

గురువుల గురుతర బాధ్యతలు

అధ్యాపకులు తమ విద్యార్థుల బహుముఖాభివృద్ధికి, సత్‌శీలాభివృద్ధికై శ్రద్ధ తీసుకోవాలి. తరచుగ బాలబాలికల తల్లిదండ్రులను కలుసుకోవాలి. ఇంట వున్నప్పుడు వారి ప్రవర్తన ఏరీతిగా వుంది? తరగతిలో బోధించే పాఠములు వారికి అర్థమవుతున్నవా? వారి ఆరోగ్యం ఎట్లుంది? వారు తల్లిదండ్రులపట్ల, పెద్దలపట్ల వినయ విధేయతలను, గౌరవ మర్యాదలను ప్రకటిస్తున్నారా? నిత్యం దైవప్రార్థన, ధ్యానము, జపము చేస్తున్నారా? ఎటువంటి స్నేహితులతో తిరుగుతున్నారు? తల్లిదండ్రులు వారికి 'పాకెట్ మనీ' ఇస్తున్నారా? బజారులో తయారుచేసిన ఫాస్ట్‌ఫుడ్ తింటున్నారా? టి.వి. ముందు ఎక్కువ సమయం గడుపుతున్నారా? మొదలగు ప్రశ్నలు వేసి ఓర్పుగ, నేర్పుగ వారి వద్దనుండి సమాచారము పొందాలి. అటువంటి అధ్యాపకులమీద తల్లిదండ్రులకు గౌరవ ఆదరములు అధికమవుతాయి.

అధ్యాపకుడు ఒక తోటమాలివంటివాడు. ఒక తోట అందంగా, ప్రయోజనకరంగా వుండాలి అంటే ముందుగా తోటమాలి తోటను (మొక్కలను) ప్రేమించాలి. తోటలో రకరకాల మొక్కలు వుంటాయి. ఒక్కొక్క మొక్కకు ఒక్కొక్క రకమైన ఎరువు వెయ్యాలి. కొన్నింటికి నీరు ఎక్కువగా కావాలి, కొన్నింటికి అక్కరలేదు. తీగెలకు పందిరి వెయ్యాలి. పశువులు, మేకలు లోపలికి జొరబడకుండా కంచెకట్టాలి. ప్రతి దినము మొక్కలను పరీక్షించి చీడ పురుగులను, వేరు పురుగులను దూరము చేయడానికి తగిన చికిత్స చెయ్యాలి. చెట్టుకు పండిన ఫలములను పక్షులనుండి రక్షించే విధానము చేపట్టాలి. అప్పుడే ఆ తోట శోభాయమానముగా, ఫలవంతంగా వుంటుంది.

అటులనే అధ్యాపకుని పరిరక్షణలో వందలాది బాలబాలికలు ఉంటారు. వివిధ తెగలకు, మతములకు,

వర్గములకు చెందినవారు ఉంటారు. వీరి మనోబుద్ధుల ప్రమాణంలో వైవిధ్యం వుంటుంది. ఈ భిన్నత్వమును గుర్తించి అందరినీ సంతృప్తిపరచేటట్లు వ్యవహరించాలి. అందరినీ ఆహ్లాదపరచాలి. కొందరికి ఒక్కసారి బోధిస్తే చాలును. మరికొందరికి అనేకమార్లు చెప్పాలి. దీనికి సహనం, క్షమ అవసరం. కొంతమంది తరగతి పరీక్షలలో మార్కులు రాకపోతే నిరుత్సాహపడుతారు. వారిని ఉత్సాహపరచేటట్లు మాట్లాడాలి. వారు తమ తెలివితేటలను ఏవిధంగా అభివృద్ధి పరచుకోవచ్చునో చెప్పాలి. ఒక్కొక్కరికి ఒక్కొక్క పద్ధతి.

అధ్యాపకుడు ఒక శిల్పివంటివాడు. ఏ రాయి ఎటువంటి ప్రతిమను మలుచుటకు పనికివస్తుందో శిల్పికి తెలుస్తుంది. ఒక శిల అలంకార వస్తువుకు, మరొక శిల సుందరమైన దేవతామూర్తిని చెక్కుటకు పనికివస్తుంది. అటులనే ఒక గురువు తనవద్దనున్న బాలబాలికల శారీరక, మానసిక పరిణతిని, అభిరుచులను పురస్కరించుకొని వారిని తీర్చిదిద్దాలి. తమ విద్యార్థులలో ఎంతమంది వివేకానందులు, తిలక్కులు, నేతాజీలు వున్నారో తెలియదు. వారి వ్యక్తిగత ప్రతిభను వెలికితీసి వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి.

అధ్యాపకుడు ఒక అలారం బెల్‌వలె అజ్ఞానమనే నిద్రలో వున్న బాలబాలికలను మేలుకొలిపి 'తమసోమా జ్యోతిర్గమయ' అను వాక్యమునకు సార్థకత చేకూర్చాలి.

అధ్యాపకులు 'గైడ్‌పోస్ట్' వంటివారు. బాలబాలికల దివ్య జీవితమునకు, దీర్ఘజీవితానికి మార్గదర్శకులవుతారు. భౌతిక జీవితంతోపాటు దానికి ఆధారమైన ఆధ్యాత్మిక జీవిత తత్త్వమునకుకూడా సూచనలిస్తారు. గురి చూపేవాడే గురువుకదా! ఐతే 'గైడ్‌పోస్ట్' వలె అధ్యాపకులు స్థిరత్వంతో కూడినవారుగా ఉండాలి.

అధ్యాపకులు వాటర్ ట్యాంకు వంటివారు. ట్యాంకులో ఎట్టి నీరుంటుందో ట్యాపులలో నుండి అదే నీరు వస్తుంది. ఈ ట్యాపులు బాలబాలికలే. కాన అధ్యాపకులు తమ హృదయాలనే ట్యాంకులను పవిత్రమైన భావములతో నింపుకోవాలి. వారి హృదయాలలో మూడు 'పి' లు (ప్యూరిటీ, పేషన్స్, పర్‌సివరెన్స్ – పవిత్రత, సహనము, పట్టుదల) వుంటే వాటి విలువను, విశిష్టతను గుర్తించి పిల్లలకు కూడా బోధించగలరు. ఈ మూడే ఈనాడు దేశాన్ని రక్షించగలవు.

మానవ జీవితానికి రాజబాట ఏర్పరచువారే అధ్యాపకులు. సాధారణంగా బ్రతుకలేనివాడు బడిపంతులైనాడు అంటారు. కాదు, కాదు, బ్రతుకుయొక్క అర్థము, పరమార్థము నేర్పేవారే అధ్యాపకులు.

గురువులకు తగిన శిష్యులు

విద్యార్థుల శక్తిసామర్థ్యాలు, గురువునుండి లభించిన ప్రసాదము. గురువుయొక్క ప్రతిభ విద్యార్థుల విజయమును బట్టి, నడతనుబట్టి నిర్ణయింపబడుతుంది. ఒక విద్యార్థి విజయం సాధించి నడతలో గుర్తింపు పొందినాడంటే ఆ ఘనత గురువుదే.

భోజరాజు సభలో ఇద్దరు గురువులు వాదోపవాదాలకు సిద్ధమయ్యారు. ఇరువురూ సమానమైన శక్తిసామర్థ్యములు గల పండితులే గనుక ఎంతకాలమైనప్పటికీ ఎవ్వరూ బలహీనులు కాలేదు. ఈవిధంగా ఎవరు గొప్పో తేల్చడం అసాధ్యమని భావించి, ఇతని ప్రధాన శిష్యుడు, అతని ప్రధాన శిష్యుడు ఇద్దరినీ పిలిచి వారిద్దరికీ వాదోపవాదాలు పెట్టాడు భోజరాజు. అందుకు ఆ గురువులు కూడా అంగీకరించారు. ఎవరి శిష్యుడు ఓడిపోతే వారు ఓడిపోయినట్లని ఆ పోటీకి సంసిద్ధులయ్యారు. నిర్మల భావంతో నిండిన హృదయాలు కనుక నాటి గురువులు ఈ పరీక్షకు సిద్ధపడ్డారు. వారి శిష్యులుకూడా ఒకరికొకరు తీసి పోకుండా వాదోపవాదాలు సాగించారు. ప్రజారంజకమైన, ధర్మబద్ధమైన వాదోపవాదాలలో ఇరువురూ సమఉజ్జీలుగా నిలిచారు. ఆ శిష్యుల ప్రతిభను గుర్తించిన వ్యక్తులందరూ వారి గురువుల విజ్ఞానాన్ని వేనోళ్ల పొగిడారు. కనుక, అధ్యాపకుల శక్తిసామర్థ్యాలు విద్యార్థుల విజయాలనుబట్టి, వారి నడతలనుబట్టే గుర్తించడానికి వీలవుతుంది. అలాంటి ఆదర్శప్రాయులైన అధ్యాపకులు తయారైనప్పుడే, ఈనాడు విద్యారంగం ప్రగతి సాధించడానికి, పూర్ణత్వం పొందడానికి అవకాశము ఉంటుంది.

(తరువాయి వచ్చే సంచికలో)

దివ్యస్మృతులు

❖ ప్రొ॥ చెల్లి జనార్దన ❖

ప్రశాంతి మందిరంలోకానీ, కాలేజిలోకానీ ఎక్కడైనా సరే, విద్యార్థులు, అధ్యాపక వర్గంతో స్వామివారి అనుగ్రహ భాషణము ఎప్పుడూ సమాజసేవ, ఆత్మవిచారణల చుట్టూ తిరుగుతుండేది. చిరస్మరణీయమైన ఆ దివ్యస్మృతులు కొన్ని మీతో పంచుకొనే ప్రయత్నం చేస్తాను.

1980 దశకం ఆరంభంలో భగవాన్ బాబావారు శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయం, ప్రశాంతినిలయం క్యాంపస్‌కి తరచుగా వస్తూ ఉండేవారు. ఒక్కొక్కసారి తమ వెంట ఎవరైనా ఒక ప్రముఖ వ్యక్తినో లేదా పెద్దలైన భక్తులనో తీసుకొచ్చేవారు. ఒకసారి వారు కెమిస్ట్రీ లేబొరేటరీకి విచ్చేసినప్పుడు అక్కడ బల్లమీద ఉన్న అణుసముదాయాల (మాలెక్యూల్స్) నమూనాలను చూస్తూ, ఒక విద్యార్థి రూపొందించిన కర్పూరం తాలూకు 'మాలెక్యూల్'వైపు దృష్టి సారించి, దానిగురించి ఆ విద్యార్థిని ప్రశ్నించారు.

కెమిస్ట్రీ లేబొరేటరీలో భగవాన్

ఆ 'మాలెక్యూల్'లో ఉండే వివిధ పరమాణువుల (ఆటమ్స్) గురించి ఆ విద్యార్థి వివరించాడుకానీ, అది స్వామికి అంత సంతృప్తి కలిగించలేదు. ఆ విద్యార్థి ఇంకాస్త లోతుగా ఆ 'మాలెక్యూల్' ధర్మాలను వివరించబోగా స్వామి, "ఈ కర్పూరంయొక్క ముఖ్య ప్రయోజనం ఏమిటి?" అని అడిగారు. "హారతి ఇవ్వటానికి ఉపయోగిస్తాము, స్వామీ" అన్నాడా విద్యార్థి. అప్పుడు స్వామి, "కర్పూరం ఆనవాలు మిగల్చకుండా మండిపోతుంది కదా. అలాగే, ప్రతి ఒక్కరూ లేశమాత్రమైనా కర్తృత్వభావం లేకుండా నిస్వార్థంగా, సంపూర్ణంగా సమాజసేవకు అంకితమైపోవాలి" అన్నారు. అంతేకాదు, "రసో వై సః" అన్న వేదోక్తిని ఉటంకిస్తూ, భగవంతుడు రసస్వరూపుడు, శాస్త్రీయ విజ్ఞానమంతటికీ పునాది రసాయన శాస్త్రమే అని చెప్పారు.

అనన్య జీవకారుణ్యం

స్వామివారియొక్క ప్రతి చర్యలోనూ ఏదో విశేషమైన అర్థమూ, ప్రయోజనమూ ఉంటాయని వేరే చెప్పనక్కర్లేదు. మాకొకసారి వారి దివ్య సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే అవకాశం వచ్చింది. కళాశాలలో గణేశ్ మంటపం ఎదురుగా గల విశాలమైన ప్రాంగణంలో సభ ఏర్పాటైంది. గోవా గవర్నర్ శ్రీ నకుల్ సేన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమం జరుగుతూ ఉండగా ఎక్కడినుండో ఒక కుక్క పరుగెత్తుకుంటూ వచ్చి, గణేశ్ మంటపం మెట్ల వద్ద నిలబడింది. అది గమనించి కరుణాసముద్రులైన స్వామి, తమ సింహాసనం చెంతనున్న వెండిపళ్ళెంలోని వేరుశెనగ గింజలను దాని ముందుకు విసిరారు. చిన్న సంఘటనే కావచ్చు కాని అది, "సాటి వ్యక్తులనే కాదు, సకల జీవరాశులనూ ప్రేమించు" అన్న వారి మహత్తరమైన సందేశాన్ని పునరుద్ఘాటించింది. స్థావర జంగమాలు, చిన్న పెద్ద, మానవులు, జంతువులు అనే తేడా లేకుండా అన్నీ భగవంతునికి ముఖ్యమేనని దీనినిబట్టి మనం గ్రహించవచ్చు.

సేవ ఎక్కడో స్వామి అక్కడ

ఒకమారు 'అఖిల భారత బాలవికాస్ ర్యాలీ' నిమిత్తం ముళ్ళ కంపలు ఏరిపారేసి, హిల్ వ్యూ స్టేడియంను శుభ్రం చేసే సేవాభాగ్యాన్ని స్వామి మాకు ప్రసాదించారు. రోజూ కాలేజిలో పనివేళల అనంతరం మేము స్టేడియంకి వెళ్ళి ఆ సేవాకార్యక్రమంలో పాల్గొనేవారము. స్వామి, ఆపిల్ పళ్ళూ, బన్నులూ, ఇతర తినుబండారాలూ తెచ్చి తామే స్వయంగా మా అందరికీ పంచేవారు. అలాగే ఈశ్వరమ్మ స్కూలు వెనుక మేమొక స్టేజి కడుతున్న సమయంలో

స్వామివారు ఒక సాదా ఇనుపకుర్చీలో కూర్చుని, అక్కడ జరుగుతున్న పనిని స్వయంగా పర్యవేక్షించారు. వారి దివ్య సమక్షంలో జరగకపోతే, ఆ పని సకాలంలో పూర్తయ్యేది కాదు.

60వ జన్మదినోత్సవాలలో భాగంగా, శ్రీ సత్యసాయి మండలంలోని అన్ని గ్రామాలలోనూ ఆలయాల నిర్మాణానికి స్వామి దయతో అనుమతించారు. ఆ వేసవిలో పర్తిలోనే ఉండిపోయిన విద్యార్థులకు, సిబ్బందికి, దగ్గరలోని గ్రామాలకు అప్రోచ్ రోడ్డుల నిర్మాణం చేపట్టే అవకాశం ఇచ్చారు. స్వామివారు కూడా పర్తిలోనే ఉండి పనులను పర్యవేక్షిస్తూ మాకు కావలసివన్నీ సమకూర్చారు. మేము ప్రతి రోజూ ఉదయం గ్రామాలకు బయల్దేరేముందు టిఫిన్ చేయడానికి క్యాంటీన్లో ఏర్పాట్లు చేయించారు. పని జరిగే అన్నిచోట్లకూ మధ్యాహ్న భోజనం పంపించేవారు. అంతేకాదు, సాయంత్రంవేళ మేము ఊళ్ళనుంచి తిరిగి వచ్చేంతవరకు మాకోసం కనిపెట్టుకుని ఉండేవారు. ఎంతో ప్రేమతో, ఆయా గ్రామాల్లో పని జరుగుతున్న తీరును కనుక్కుంటూ, మధురమైన మామిడి పళ్ళను మాకందరికీ పంచుతూ, "అంకిత భావంతో శక్తివంచన లేకుండా సేవ చేయడం మీ బాధ్యత" అని గుర్తుచేసేవారు. మేము సేవలు ముగించుకొని తిరిగి వచ్చే సమయంలో గ్రామాల్లోని పిల్లలు "సాయిరాం, గుడ్ బై" అంటూ మాకు ఆత్మీయంగా వీడ్కోలు చెప్పటంగురించి ప్రస్తావించి, అది గ్రామీణుల నిష్కల్మషమైన, హృదయపూర్వకమైన మైత్రీభావాన్ని తెలుపుతుందన్నారు. నిజానికి నిష్కామసేవ మైత్రిని పెంపొందిస్తుందని చెప్పారు.

ఒకరోజు స్వామివారు స్వయంగా ఆమగుండపాలెంను సందర్శించారు. కొండలమధ్య ఉన్న ఆ గ్రామానికి ఆ రోజుల్లో సరియైన రోడ్డు సౌకర్యం లేదు. ఎత్తుపల్లాలతో సాఫీగా లేని ఆ దారిలో ప్రయాణించడం చాలా ఇబ్బందిగా ఉండేది. ఆ అసౌకర్యాన్ని ఏమాత్రం లెక్కచెయ్యకుండా, దయాళువైన స్వామి ఆ గ్రామానికి విచ్చేసి, గ్రామస్తులకు అనుగ్రహ భాషణం అందించారు. తమ ప్రేమకు గుర్తుగా, గ్రామస్తుల్లో ఒకరికి బంగారు ఉంగరం సృష్టించి అనుగ్రహించారు.

"ఆర్డినరీ ప్రెజెంట్ కాదు, ఆమ్నీప్రెజెంట్"

స్వామివారు అధ్యాపక సిబ్బందికి అనుగ్రహించే ఇంటర్వ్యూలలో ఏమైనా సందేహాలుంటే అడగమని మమ్మల్ని ప్రోత్సహించేవారు. ఒకసారి అధ్యాపకు లొకరు, "స్వామీ, సమాజంలో దుష్టులు, దుర్మార్గులుకూడా వృద్ధిలోకి రావటాన్ని గమనిస్తుంటాము. కారణమేమిటి?" అని అడిగారు. స్వామి ఒక సామ్యాన్ని ఉదాహరిస్తూ ఇలా వివరించారు: "ఈ ఏడాది గోదావరి ప్రాంతంలో అనావృష్టి ఉంది. మీరెవరైనా అక్కడున్న మీ బంధువుల ఇంటికి వెళ్ళారనుకోండి. పొలాలు బీళ్ళయి పడున్నా, వాళ్లు మీకు మేలిరకం వరి అన్నం పెట్టారు. అలాగే తమిళనాడులో వర్షాలు బాగా కురిసి, పంటలు చక్కగా పండే ప్రాంతానికి వెళ్ళారనుకోండి. అక్కడ ఎవరింటికో వెళితే, వరిపొలాలు పచ్చగా కళకళలాడుతున్నా, వాళ్ళు మీకు రాగిముద్ద పెట్టారు. ఎందువల్ల? గోదావరి ప్రాంతంలో వరి అన్నం పెట్టడానికి, గత ఏడాది అక్కడ పంటలు పుష్కలంగా పండడం కారణం. తమిళనాడులో రాగిముద్ద పెట్టడానికి, గత ఏడాది అక్కడ సంభవించిన అనావృష్టి కారణం. అలాగే వర్తమానంలో మనం గతకాలపు కర్మల ఫలితం పొందుతాం. ఇక వర్తమానంలో మనం ఆచరించే కర్మల ఫలితమే భవిష్యత్తులో అనుభవిస్తాము. 'పాస్ట్' అనే వృక్షము నుండి వచ్చినదే 'ప్రెజెంట్' అనే విత్తనము. ఈ 'ప్రెజెంట్'లోనే 'ఫ్యూచర్' అనే వృక్షము దాగియుంది. ఆవిధంగా 'పాస్ట్', 'ఫ్యూచర్' (భూత భవిష్యత్కాలములు) రెండూ 'ప్రెజెంట్' (వర్తమానం)లో ఇమిడి ఉన్నాయి. కాబట్టి, ఇది 'ఆర్డినరీ ప్రెజెంట్' కాదు, 'ఆమ్నీప్రెజెంట్'" అన్నారు.

అనంతరం స్వామివారు, పిల్లలు పరీక్షలు ఎలా రాసారని అడిగారు. "విద్యార్థి ఫెయిలయితే మీరుగాని, వారి తల్లిదండ్రులుకాని పట్టించుకోకపోవచ్చు, కాని నాకు చాలా బాధగా ఉంటుంది" అని చెప్పారు. ప్రతి విద్యార్థి అత్యుత్తమమైన "ఓ" (Outstanding) గ్రేడు పొందాలని చెపుతూ, కేవలం సబ్జెక్టుల్లో మాత్రమే "ఓ" గ్రేడు రావడం తమకు సంతృప్తి కలిగించదని, విద్యార్థులు తమ ప్రవర్తనలో కూడా "ఓ" గ్రేడు తెచ్చుకోవాలన్నారు.

“భాగవతం చదివితే బాగవుతాం”

“అన్ని దిక్కులనుండి ఉదాత్తమైన ఆలోచనలు ప్రాప్తించుగాక” అంటుంది ఋగ్వేదం. నేను మందిరంలో స్వామివారి దర్శనార్థం నిరీక్షిస్తున్న సమయంలో ఎక్కువ భాగం శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పవిత్ర గ్రంథాలను చదువుతూ ఉండేవాడిని. ఒకసారి భాగవత పారాయణం ప్రారంభించే ముందు స్వామివారి ఆశీస్సులు తీసుకోవాలన్న కోరిక నా మనసులో మొలకెత్తింది. సంకల్పాలు మంచివైతే, దైవం ఆశీస్సులు లభిస్తాయి కదా! దర్శన సమయంలో స్వామి నేరుగా నావద్దకు వచ్చి నిలిచారు. నేను భక్తితో మోకరిల్లి, వారి ఆశీస్సులకోసం పవిత్ర భాగవత గ్రంథాన్ని పట్టుకున్న చేతులు ముందుకు చాపాను. స్వామి ప్రేమగా ఆ గ్రంథంపై తమ దివ్యహస్తాన్నుంచి, “ఏమిటిది?” అని అడిగారు. “భాగవతం స్వామీ” అన్నాను. అందులో ఏమి ఉంటాయని అడిగారు. భగవంతుని కథలు ఉంటాయని చెప్పాను. నా కళ్ళలోకి చూస్తూ, “హిజ్ స్టోరీస్ (His Stories – భగవత్కథలు), అదే నిజమైన హిస్టరీ (History)” అన్నారు స్వామి. ఆ వెంటనే తేట తెలుగులో **“భాగవతము చదివితే బాగవుతాము”** అనే విశేషమైన వివరణ ఇచ్చారు.

భాగవతములోని ప్రహ్లాద చరితం అందరికీ తెలిసిందే! లోకాలన్నింటినీ జయించానని అహంకారంతో విఱ్ఱవీగే హిరణ్యకశిపునితో ప్రహ్లాదుడు, “తండ్రీ! నీవు లోకాలన్నింటినీ జయించావుకానీ నీ ఇంద్రియాలను, మనస్సును జయించలేకపోతున్నావు. నీలోనే ఉండి నిన్ను కట్టడి చేస్తున్న కామ క్రోధాది అరిషడ్వర్గాలపై విజయం సాధిస్తే నీకు విరోధి అనేవాడే ఉండడు కదా!” అంటాడు.

కామం వలన రావణుడు, క్రోధం వలన హిరణ్యకశిపుడు, లోభం వలన దుర్యోధనుడు ఏరీతిగా పతనమైపోయినారో వివరిస్తూ, “లోని శత్రువులకు లొంగిపోయినవాడు బయటి రిపుల నెట్లు పట్టగలడు?!” అంటారు భగవాన్. ఈ అంతశ్శత్రువులపై విజయం సాధించినప్పుడు అంతర్యామి అనుగ్రహంతో మోక్షసౌధ ప్రవేశానికి అర్హులమవుతాము. ఈ ప్రయత్నంలో మనము ఒక అడుగు వేస్తే, స్వామివారు కరుణించి మనల్ని మరో పది అడుగులు ముందుకు నడిపిస్తారన్నది భక్తులందరికీ అనుభవంలో ఉన్న విషయమే. చిత్తశుద్ధికోసం మనం ఏ కించిత్ ప్రయత్నం చేసినా, అంతశ్శత్రువులను అణచివేయటంలో స్వామివారు మనకు తోడ్పాటునందించి, మన హృదయపాత్రను తమ అనుగ్రహామృతంతో నింపివేస్తారు.

(వ్యాసకర్త శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్, ప్రశాంతినిలయం కేంపస్ కెమిస్ట్రీ విభాగంలో గత నాలుగు దశాబ్దాలుగా ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు)

తెలుగుసేత: వసంతభాను

సాయీ యని తీయగా పాడనా

❖ ఎమ్.ఎస్. ప్రకాశరావు ❖

ప॥ సాయీ యని తీయగా పాడనా
హృదయాన ఉయ్యాలలూపనా
అ॥ప॥ దేవాదిదేవా శ్రీ సాయిదేవా
ఆనందబాష్పాల అర్చించనా
నిన్ను ఆనందబాష్పాల అలరించనా

చ. 1. రామావతారా ప్రేమావతారా
కౌసల్యనై నిన్ను లాలించనా... నేను
పావనినై నీ పాదాలు పట్టనా
నీ పాదసన్నిధిని తలవాల్చనా
నీ పాదపద్మాలు తలదాల్చనా

చ. 2. గోపాల బాలా సాయి గోపాలా
దేవకిని అయి నిన్ను సేవించనా (2)
గోకులమునందున వేణువును నేనై
నీ గానమై నేను పులకించనా
నీ స్పర్శతో నేను తరియించనా ❖

సుందర సాయి సుమధుర సంభాషణలు

డా॥ దువ్వూరి ఇందిరా దేవి

ప్రథమ దర్శనము

1957 ఏప్రిల్‌లో నేను పుణ్యభూమి పుట్టపర్తిలో తొలిసారి అడుగుపెట్టి స్వామిని దర్శించుకున్నాను. ఆ ప్రథమ దర్శనం అంతులేని ఆనందం కల్గించినది. నాకు చిన్నప్పటినుండి కృష్ణుడంటే అమితమైన భక్తి. స్వామిని చూడగానే, "మనలను ఆదుకోవటానికి కృష్ణుడే మరల జన్మించినాడా" అనిపించినది. ఆరోజున స్వామి ఎక్కడికో ప్రయాణమై వెళుతున్నారు. మా నాన్నగారి దగ్గరకు వచ్చి, "ఇక్కడే ఉండండి, నేను వారం రోజులలో తిరిగి వస్తాను. వచ్చాక మీతో మాట్లాడి మీకు ఆనందాన్ని కలిగిస్తాను" అని అభయమిచ్చారు.

స్వామి తిరిగి వచ్చాక మాకు ఇంటర్వ్యూ అనుగ్రహించారు. "మిమ్ములను పాపం వెయిట్ చేయించాను. ముందుగా అనుకున్న ప్రయాణం కనుక, వెళ్లాల్సివచ్చినది" అన్నారు. మాకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరం స్వామికి లేదు. ఐతే, మనం సాటి మనుషులతో ఎలా ప్రవర్తించాలి అనేది మాకు నేర్పిస్తున్నారనిపించింది. ఒక తాయెత్తు సృష్టించి నాకిస్తూ, "నీకు ఆరోగ్యాన్నిస్తున్నాను" అన్నారు. ఆ తరువాత, అలెర్జీతో నాకు వచ్చిన మచ్చలు క్రమక్రమంగా మరుగయిపోయినవి. భగవంతుని సన్నిధిలో, భగవంతుని ప్రతి చర్యలో, ప్రతి సంభాషణలోను అనిర్వచనీయమైన ఆనందము, నిగూఢమైన సందేశము ఉంటాయి.

మేము ఆరోజులలో గూడూరు (నెల్లూరు జిల్లా) నుండి పుట్టపర్తి రావాలంటే మూడు రైళ్లు మారవలసివచ్చేది. తర్వాత బస్సులో కొత్తచెఱువు వరకు వచ్చి, అక్కడి నుండి ఎడ్ల బండిలో ప్రయాణించి, చిత్రావతి నదిలో కొంత దూరం నడిచేవాళ్లము. ప్రశాంతినిలయంలో అడుగు పెట్టగానే స్వామి మేడమీద యేదో ఒకవైపున కనిపించేవారు. "గూడూరువాళ్ళు వచ్చారు, వసతి కల్పించండి" అని చెప్పేవారు. ఆ దివ్య సుందర స్వరూపమును దర్శించి, ఆ మృదుమధురస్వరము విని మేము పడిన శ్రమంతా మరచిపోయేవాళ్ళము. మాటలతో వర్ణించలేని మధురానుభూతిని పొందేవాళ్లము.

ఆ రోజులలో పుట్టపర్తిలో సౌకర్యాలు లేకపోయినా, వసతులు లేకపోయినా మాకు ఏమాత్రము ఇబ్బంది అనిపించేది కాదు. చెట్ల క్రిందనో, లేక వరండాలోనో సామాను పడేసి స్వామి దర్శనానికి ఆత్రుతతో వెళ్ళేవారం. వస్తువులు పోతాయనే భయం లేదు. ఉదయం నుండి రాత్రివరకు స్వామి చింతనే, స్వామి కబుర్లే! స్వామి మా అందరి మధ్య తిరుగుతూ పలకరిస్తూ ఉండేవారు. హాస్యంగా మాట్లాడి నవ్వించేవారు. నిత్యం స్వామి దర్శన

సంభాషణలతో ఆనందసాగరంలో ఓలలాడేవారము. ఎన్నిసార్లు చూసినా తనివి తీరేది కాదు. అదే జీవాత్మకు పరమాత్మయందు గల ఆకర్షణ. మరల మరల చూడాలి. ఆ మృదుమధుర స్వరాన్ని మరల మరల వినాలి. అదే తపన...తపస్సు.

"నాకు మీ మనసులు కావాలి"

వినాయకుని గేటు దాటి ప్రశాంతినిలయంలోకి ప్రవేశించగానే ఇంటి విషయాలు, బాధలు, సమస్యలు అన్నీ మరచి ప్రశాంతంగా ఆనందంగా కాలం గడిపేవారం. మందిరం క్రింది వరండాలో పడమరవైపున ఉన్న గది ఇంటర్వ్యూ రూము. తూర్పువైపున ఉన్న గదిలో భక్తులు స్వామికి పాదపూజ చేసుకునేవాళ్లు. దీనిపైనున్న గదిలో స్వామి భోజనం చేసేవారు. స్వామి భోజనాల గదికి వెళ్లేటపుడు వారిని దర్శించుకునేందుకు మేము ఎదురుగా చెట్ల క్రింద కూర్చుని ఎదురు చూస్తూ ఉండేవాళ్లము.

27.5.1958 నాడు స్వామి మమ్మల్ని ఇంటర్వ్యూకు పిలిచినారు. హస్తచాలనంతో ఫోటోలు సృష్టించినారు. నేను చిన్నదాన్ని కాబట్టి నాకివ్వరని అనుకున్నాను. స్వామి పెద్దవాళ్ళు నలుగురికీ ఇచ్చి చివరకు నావైపు చూస్తూ, నీకివ్వనని అనుకున్నావుగదా అని, "ఇందిరా లోకమాతా రమా మంగళదేవతా" అని శ్లోకం చెప్పి, పెన్నుతో తెలుగులో 'ఇందిరాదేవి' అని వ్రాసి, ఇంగ్లీషులో, 'విత్ బ్లెస్సింగ్స్ శ్రీ సత్యసాయిబాబా" అని వ్రాసి నాకు అనుగ్రహించినారు.

స్వామికి పాదపూజ చేసుకుంటాము అని మేము అడిగితే సరేనన్నారు. స్వామి మాపై చూపించిన దయకి పొంగిపోయాము. స్వామి పాదాలు పన్నీరుతో కడిగి తుడిచి పసుపురాసి కుంకుమ గంధము పెట్టి పుష్పాలతో పూజించి హారతి ఇచ్చాము. అందరూ పాదాలకు పసుపురాసి ఒక క్రొత్త బట్ట మీద స్వామి పాదముద్రలు పడేట్లు చేసుకుని ఇంటిలో పూజారూములో పెట్టుకునేవారు. ఆ విషయం మాకు తెలియక మేము చేయలేదు. **"ఇవన్నీ మీకు తృప్తి, నాకు బాధ. నాకు మీ మనసులు కావాలి. నేనే మీరు, మీరే నేనుగ మారాలి"** అన్నారు స్వామి.

"స్వామీ! ఇంటికి రండి స్వామీ" అని అడిగితే, **"నీది అనేది ఉంటే రావల్సిందే. కాని నీది యేముంది?! అంతా స్వామిదే (భగవంతుడిది) 'నాది' అంటూ ఏమీ లేదని నీవు వదిలివేసిన రోజు, ఆనాడు నాకు నేనే వస్తాను"** అన్నారు.

భక్తి – భగవత్తత్త్వము

ఆ తరువాత 27.6.1958 నాడు అనుగ్రహించిన ఇంటర్వ్యూలో స్వామి, "భగవద్భక్తిని గురించి ఏమైనా అడగండి. మీరొకమాట నేనొక మాట చెప్తుంటే సంభాషణ సాగుతుంది. నేనొక్కడినే చెప్తూ పోతుంటే ఎలా?" అన్నారు.

అప్పుడు నేను, "భగవంతుడు నీలమేఘశ్యాముడు అంటారు. ఎందుకని స్వామీ?" అని అడిగాను.

స్వామి: భగవత్తత్త్వము అంతులేనిది, లోతయినది. సముద్రమూ, ఆకాశమూ నీలంగా కనిపిస్తాయి. దేని లోతు తెలుసుకోలేమో అది నీలంగా కనిపిస్తుంది. భగవంతుని కూడా తెలుసుకోలేము కనుక ఆయనను నీలమేఘశ్యాముడంటారు. అంత లోతైన భావాలతోనే భగవంతుని కనుగొనాలి. భగవంతుడు సర్వాంతర్యామి. ఆయన లేనిచోటు లేదు. కాబట్టి నామస్మరణకు స్థల భేదములేదు. నామముతో నిరంతరము మనస్సును మథనము చేసినప్పుడు మనలో జ్ఞానము ప్రజ్వరిల్లుతుంది. బాహ్యప్రపంచములో భావరూపముతో పరమాత్ముని కనుగొనవలెను. తీపి, వెలుతురు వీటికి ఎవరైనా రూపం చెప్పగలరా? అట్లే, భగవంతునికి కూడ రూపం చెప్పలేరు. భావనాశక్తితో నిశ్చలంగా ధ్యానించినపుడు సాక్షాత్కారం ఏర్పడుతుంది. అప్పుడు చూడగలుగుతారు.

ప్రశ్న: దైవం అందరిలో ఎలా ఉంటాడు స్వామీ?

స్వామి: పిచ్చివాడా! మామిడి విత్తనము ఒకటే నాటావు. అది చెట్టై కొమ్మలై ఎన్నో కాయలు కాసి, అవి పండుతాయి. ప్రతి పండులోను విత్తనము ఉంటుంది. అట్లే భగవంతుని నుండే జీవులన్నీ ఉద్భవించాయి. ప్రతి జీవిలోను భగవత్ తత్త్వమున్నది.

ప్రశ్న: మరి దైవం ఎందుకు కనిపించదు స్వామీ?

స్వామి: దీపం వెలుగుతున్నది. ఆ వెలుతురు

అన్నివైపులకు ప్రసరిస్తుంది. కానీ, నీవు యే ప్రక్కన అడ్డం పెట్టుకుంటావో ఆ వైపు వెలుతురు కనిపించదు.

ప్రశ్న: భగవంతుడు ఆస్తికులను, భక్తులనే చూస్తాడు, నాస్తికులను చూడడని అంటారు, నిజమేనా స్వామీ?

స్వామి: అందరూ భగవంతుని బిడ్డలే. భగవంతుడు సమతత్వంతో అన్నివైపుల చూస్తుంటాడు. నీకు దైవచింతన లేనపుడు చూడలేదనుకుంటావు. రామదాసుకు అన్ని వైపుల భగవంతుడు కనిపించాడు. అందరూ భగవత్ స్వరూపులుగా కనిపించారు. అదే అజ్ఞానికి మాత్రం అన్నివైపుల ప్రపంచమే కనిపిస్తుంది. తనకు భగవంతుడు కనిపించటంలేదంటాడు. యే రంగు అద్దాలు వేసుకుంటే ఆ రంగే దృష్టికి కనిపిస్తుంది కదా!

ఆకలయినపుడు రుచి తెలియదు. అన్నం కొఱకై పరితపిస్తారు. ఆకలి తగ్గాక రుచి తెలుస్తుంది. అజీర్ణవ్యాధి గలవానికి ఆకలిని గురించి, ఆకలిగా ఉన్నవానికి అజీర్ణాన్ని గురించి చెప్తే వింటారా! అలాగే జిజ్ఞాసువు భగవత్తత్వము అనే ఆకలికి పరితపించి ఎక్కడ యే భగవద్విషయం వినిపించినా పరితాపంతో గ్రహించి మననం చేస్తుంటాడు. అనేక జన్మల పరంపరగా వచ్చిన మీ అజ్ఞానాన్ని ఎంతో సాధనతో తొలగించుకోవాలి.

నేను: స్వామీ, మా మనస్సు అతి చంచలమైనది, కొంతసేపైనా నిలకడగా ఉండదు. ఏమి చేయాలి?

స్వామి: చిన్న బిడ్డ ఒకేసారి నడుస్తుందా? పాదాలు మృదువుగా ఉంటాయి; పడుతూ, లేస్తూ, నడవగా నడవగా పడకుండా నడువగలదు. అందుకని ప్రయత్నించాలి. అభ్యాసం చేయగా చేయగా భగవద్భక్తి స్థిరపడుతుంది.

ఎఱ్ఱగడ్డను పన్నీట వేసినా, మంచి గంధంలో వేసినా దాని వాసన పోదు. దానిని ఉప్పు, పులుసు, కారం వేసి ఉడకనిస్తే వాసన పోతుంది. అలాగే భక్తి జ్ఞాన వైరాగ్యాలను సాధిస్తే మనోవ్యామోహాలు పోతాయి. ఎఱ్ఱగడ్డను చూడు, తీస్తుంటే పొరలు వస్తూనే ఉంటాయి. కోరికలు, ఆశలూ అంతే నాయనా! వస్తూనే ఉంటాయి. ఒక్కొక్క పొర తీస్తుంటే కంట నీరు వస్తుంది. వ్యక్తిగతంగా ఉండే ఈ వ్యామోహాలు వదలాలన్నా అంత కష్టపడాలి. అనేక జన్మల పరంపరగా వచ్చిన అజ్ఞానాన్ని, వ్యామోహాన్ని నిరంతర భగవన్నామ స్మరణతో తొలగించుకోవచ్చు.

ధ్యానంలో ఏకరూపం ఉండాలి. ఒకసారి మురళీ కృష్ణుడు, ఒకసారి చిన్ని కృష్ణుడు.... ఇలా పలు రూపాలను ధ్యానించకూడదు. భజనలో యెన్ని రూపములైనా భావించవచ్చు, కాని ధ్యానానికి ఒకే రూపం, ఒకే కాలం, ఒకే స్థలం అవసరం. ఒకే రూపాన్ని భావిస్తే మనస్సు ఆ రూపం వెంట పోతుంటుంది. తల మీద పింఛము నుండి పాదాల వరకు భావిస్తే 5 నిమిషాలయినా పడ్తుంది. మరల నామం గుర్తుకొస్తుంది. ఇలా రూపం, నామం స్మరించుకుంటూ ఉంటే, స్మరించుకుంటున్నామనే భావన కూడ రాదు. ధ్యానించే స్థలము మంచి భావనలతో కూడి పవిత్రంగా ఉండాలి. పవిత్రమైన భావాలు కలిగినచోట మనస్సు పవిత్రంగానే ఉంటుంది. దేవాలయానికి వెళ్లితే అక్కడ సద్భావములు కలుగుతాయి. అక్కడ దేహాత్మ, పరమాత్మ సంబంధం చక్కగా కలుస్తుంది. అదే సినిమాకు పోయినపుడు దానికి సంబంధించిన భావనే వస్తుంది.

మీరు దిగులు, బాధ అంటుంటారు. అవి యెక్కడ నుండి వచ్చాయి? మీలో అవి చేరకుండా తరిమివేస్తే పోతాయి. ఇప్పుడీ దీపం చూడండి. ఈ గదిలో చీకటి నంతా తన క్రిందనే ఉంచుకొని వెలుతురు నిస్తుంది. ఈ దీపాన్ని పైకి ఎత్తే కొలది క్రింద చీకటి పెద్దదయిపోతుంది. మీరు అదే యోచనతో దిగులును, బాధను యెక్కువ చేసుకుంటున్నారు.

1959 దసరా ఉత్సవం

అపుడు సేవాదళం లేదు. 1959 దసరా ఉత్సవాల్లో నాకు వాలంటీరుగా సేవలందించే భాగ్యం కలిగింది. పూజా సమయంలో అందరినీ నిశ్శబ్దంగా లైనులో మందిరంలోకి పంపేవారము. స్వామి ఫోటో పెట్టి పూజారిగారు అష్టోత్తర సహస్రనామావళి చెప్తుంటే అందరూ కుంకుమ పూజ చేసేవారు. ప్రతి రోజు పూజ అయ్యాక స్వామి వరుసలలో వచ్చి అందరికీ అభిషేకతీర్థం, పాదనమస్కారం అనుగ్రహించేవారు. విజయదశమినాడు పూజ అయ్యాక స్వామి అందరికీ రవికెల గుడ్డలు, గాజులు ప్రసాదించారు. మేము ట్రేలో పట్టుకున్నాము. అందరికీ

పంచటం పూర్తి అయిన తరువాత ఒక గాజుల మలారం మిగిలిపోయింది. మేడపైకి వెళ్ళి ఇవ్వాలనుకున్నాను. ఇంతలో స్వామే మమ్మల్ని పైన భోజనాలగదికి పిలిచినారు. అమ్మ, పెద్దమ్మ, యశోదక్క, ఆమె కుమార్తె రాధ, నేను అందరం వెళ్లినాము. స్వామి ఆందరినీ కూర్చొమ్మన్నారు.

నేను: స్వామీ, రాధ భక్తి అత్యంత పవిత్రమైనది కదా.

స్వామి: 'రాధకు ఆధారం ధార ఆరాధన', రాధకు సర్వము కృష్ణమయము. ఆకాశంలో నీలిరంగు చూస్తే కృష్ణుని స్వరూపము, చిరుగాలి వీస్తే కృష్ణుని కదలిక భావన. ప్రకృతిలోని ప్రతి స్పందన, ప్రతి వస్తువు, ఆమెకు కృష్ణుని జ్ఞాపకం తెచ్చేది. పొదలో యే అలికిడి విన్నా చిన్నికృష్ణుని అడుగుల సవ్వడి అనుకునేది. సదా కృష్ణ ధ్యానంలో మైమరచిపోయేది. రాధ కృష్ణుడి మేనత్త. ఏ మేనత్తయినా తన మేనల్లుడిని ఆప్యాయతగా, ఆదరంగా ఆడించదా? కానీ ఆమెతోటి చిన్నికృష్ణుని ఆటపాటలను కవులు ప్రాపంచికంగా, లౌకికంగా వర్ణిస్తూ వచ్చారు. సినిమాలు కూడా అలాగే చిత్రించినాయి. ఇదీ ప్రపంచరీతి. మంచికి మసి పూస్తారు. పవిత్రతకు అపవిత్రత అంటగడ్తారు. రాధకు ప్రతి క్షణమూ కృష్ణ తలంపే! అదీ భక్తి అంటే. అనన్య భక్తికి వేరే ధ్యాస, చింతన ఉండదు. మీరు యే పని చేస్తున్నా సదా నామస్మరణ చేయవచ్చు. ఎంత ఆనందంగా ఉంటుందో చూడండి.

రాధ అంత్యదశలో కృష్ణుడు ప్రత్యక్షమై, "రాధా! యేం కావాలి?" అని అడిగితే, "కృష్ణా! నీ మురళీ గానం వింటూ ప్రాణం వదలాలి" అన్నది. మురళీ గానం వింటూ కృష్ణునిలో లీనమైనది. అంతే, మరల కృష్ణుడు మురళి పట్టలేదు. రాధే మురళి, మురళే రాధ. మురళికి నవరంధ్రాలుంటాయి. లోపల యేమీ ఉండదు. రాధ హృదయముకూడా ఖాళీగా, నిర్మలంగా ఉంటుంది. భగవంతుడు భక్తపరాధీనుడు. ప్రార్థించవలసినది భగవంతుని మాత్రమేగాదు, భగవంతుని బంధించిన భక్తులను కూడ గౌరవించాలి" అని సెలవిచ్చారు స్వామి.

"స్వామీ, వాలంటీరు పని చేయడానికిచ్చిన బేడ్జీ ఇందిర తిరిగి ఇవ్వలేదు. తీసుకెళ్తుందేమో" అని అమ్మ అన్నప్పుడు, "అవును పాపం, మరచిపోయింది. అది తీసుకెళ్లాలని కాదు. **హృదయంలో నేనే ఉన్నాను కదా"** అన్నారు స్వామి. ఆ వాక్యమే మనకు సదా స్మరణీయం. ప్రతి హృదయంలోను ఆత్మస్వరూపునిగా కొలువై ఉన్నది తామే కదా, అని మనకు జ్ఞప్తికి తెస్తున్నారు. మరువవద్దు, అని మరీ మరీ చెప్తున్నారు.

"స్వామి లంచగొండి అనుకున్నావా?"

ఆరోజుల్లో కొద్దిమందిమి స్వామికి నివేదించాలని మేము వండిన పదార్థాన్ని ఒక చిన్న గిన్నెలో తీసుకుని వెళ్ళి, మందిరం తూర్పువైపు మెట్లు ఎక్కి భోజనాల గదిలో పెట్టేవారము. తరువాత మెట్లమీద కూర్చునేవాళ్లము. స్వామి భోంచేసి వెళ్లాక వాళ్లవాళ్ల గిన్నెలు తీసి చూసి, ఎవరి గిన్నెలోనిది స్వామి స్వీకరించి ఉంటే అది ప్రసాదంలాగ అందరికీ పంచిపెట్టేవాళ్లు. వాళ్లది తీసుకున్నారే, నాది తీసుకోలేదే అన్న భేదభావనగాని, ఈర్ష్య అసూయలుగాని ఎవరికీ ఉండేవి కావు. ఎవరి గిన్నెలోనైనా కొంత తీసి ఉంటే చాలు, ఎంతో ఆనందించేవాళ్లము.

ఒకరోజు నేను, మా కజిను భూదేవి ఇద్దరం మెట్ల మీద కూర్చుని ఉన్నాము. ఆ రోజు మేము ఊరికి వెళ్లాలి. పర్తి వదిలి వెళ్లాలంటే చాలా బాధగా ఉండేది. మరల ఎప్పుడు రాగలమో? అని దిగులు. సాయిమాతను వదిలి వెళ్లలేక వెళ్లేవాళ్లం. నేను భూదేవి చెవిలో మెల్లగా అన్నాను, 'ఈరోజు మన ప్రయాణం ఆగిపోతే వినాయకుడికి టెంకాయ కొడదాము' అని.

స్వామి భోజనం అయ్యాక, అటు వెళ్లకుండా మెట్లవైపు తలుపుతీసి, "స్వామి లంచగొండి అనుకున్నావా? మీ టెంకాయలకు ఆశపడ్తారనుకున్నావా?!" అన్నారు. ఇద్దరం బొమ్మల్లాగ నిలిచిపోయాము. "స్వామి ఒక్క భక్తికే లొంగుతారు" అన్నారు మళ్ళీ.

సర్వాంతర్యామికి సర్వం విదితమేగదా. ఇది మనకు ప్రతి క్షణము జ్ఞాపకం ఉంటే చాలు. స్వామి మన హృదయంలో ఆసీనులై అన్నీ వింటున్నారు, అన్నీ చూస్తున్నారనేది జ్ఞప్తికి వస్తుంటే మనం పొరపాట్లు, తప్పులు చేయము. భక్తిమార్గంలో పయనించి భగవంతుని చిక్కించుకోవాలని ప్రయత్నిస్తాము.

(ఇంకా ఉంది)

సౌందర్య సుషమ

❖ స్వర్గీయ ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య ❖

అది ప్రశాంతినిలయం. పగలు పది గంటల సమయం. వరండాలో పెద్దగా ఎవరూ లేరు. బయట అక్కడక్కడా కొందరు ప్రతీక్షిస్తున్నారు. భక్తులందరికీ మరొక్కసారి ఆనంద దర్శనం అందించటానికి స్వామి బయటకు వచ్చేటట్లుంది. అందరితోపాటు ఎంతో ఉత్కంఠతో నేనూ ఎదురుచూస్తున్నాను.

చిరునవ్వు లొలికించే చిన్మయమూర్తులై మన తలపులను స్తంభింపజేస్తూ, తలుపులపై నిలబడి ఉన్న జయ విజయులను వేయి కళ్ళతో పరిశీలిస్తున్నాను. అంతలో తలుపు గడియ కదిలింది. ఆ ఆనందంలో గుండె కొట్టుకోవటం ఆగిపోయినంత పనైంది. మందస్మిత వదనారవిందంతో మెల్లమెల్లగా స్వామి నడచి వస్తున్నారు. ఆహా! ఎంత భాగ్యం! నా దగ్గరికే వచ్చేశారు. "కారు తీసుకొని రమ్మను" అన్నారు. వెళ్ళిచూశాను. అక్కడ కారు లేదు. వచ్చి ఆ మాటే మనవి చేశాను. "మరి ఏముంది?" అన్నారు. "స్వామీ, ఆటో" అన్నాను. "తీసుకొని రా" అన్నారు. ఆటో వచ్చింది. "ఆ... ఎక్కు" అన్నారు. ఆటోలో కూర్చున్నాను. కాలేజి గేట్లో దిగి లోపలికి వెళ్ళాము. అరువదవ పుట్టుపండుగకోసం ఎన్నో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అవన్నీ పరిశీలించారు. కొన్ని విషయాలు నాతోను చెప్పారు. తిరిగి గేటు దగ్గర నిలబడి ఉన్న ఆటో దగ్గరకు వచ్చాం. అప్పుడు నేనిలా స్వామిని ప్రార్థించాను, "స్వామీ, అరువదో పుట్టినరోజు పండుగలో మీ సేవ చేసే భాగ్యం అనుగ్రహించండి."

స్వామి, "ఏం చేస్తావు? ఏం లేదే! అన్నీ అందరికీ అప్పజెప్పాను."

"ఏది చెయ్యమన్నా చేస్తాను స్వామీ" అన్నాను.

"ఆ శాంతివేదికపైన కూర్చుని ప్రోగ్రామ్స్ ఆర్గనైజ్ చేస్తావా?" అన్నారు స్వామి.

నా ఆనందానికి అంతు లేదు. "మహాభాగ్యం స్వామీ" అన్నాను.

"అయితే ఒక్క మాట. ఫోర్టీన్త్ కే రావాలి" అన్నారు.

"అలాగే లీవు పెట్టి వస్తాను స్వామీ" అన్నాను.

మరల ఆటో ఎక్కి మందిరానికి వచ్చేశాం.

ఇది ఆగస్టు 20వ తేదీన తెల్లవారుతుండగా తిరుపతిలో నాకు వచ్చిన కల. స్వామి కనబడిన కల కల్ల కాదు. అది ముమ్మాటికీ నిజమని గాఢ విశ్వాసం కలవాడిని నేను. రోజులు గడిచాయి. 1985 సెప్టెంబరు 8వ తేదీ సకుటుంబంగా ప్రశాంతినిలయం వెళ్ళాం. స్వామి 9వ తేదీన ఇంటర్వ్యూ అనుగ్రహించారు. అరువదేళ్ళ పుట్టు పండుగ ప్రస్తావన వచ్చింది. స్వామి ఎన్నో విషయాలు చెప్పారు. నా శ్రీమతి అన్నది, "స్వామీ, మేము రావద్దా?" అని. స్వామి నవ్వుతూ అన్నారు, "ఎందుకు రావద్దూ. తప్పక రావాలి. అయితే, ఫోర్టీన్త్ కే రావాలి, ఫోర్టీన్త్ కే రావాలి" అనే స్వామి మాటలు చెవుల్లో పడేటప్పటికి ఆగస్టులో నా స్వప్నంలో చెప్పిన మాటలు జ్ఞాపకం

వచ్చాయి. "స్వామీ, స్వప్నంలో నాకిలాగే చెప్పారు" అన్నాను. "అవును చెప్పాను, స్వప్నంలోనే కాదు, ఇప్పుడూ చెబుతున్నాను. వచ్చి ప్రోగ్రామ్స్ ఆర్గనైజ్ చేయి. కానీ ఫోర్టీన్త్ కే రావాలి" అన్నారు స్వామి. మా ఆనందానికి అవధులు లేవు.

తిరుపతి చేరుకున్నాం. కొన్ని రోజులు జరిగాయి. అక్టోబరు 15వరకు వత్తిడి లేకుండా బాగానే గడిచింది. అక్కడినుంచి అన్ని కోణాలనుంచి పరీక్షలు ప్రారంభమైనాయి. అటు యూనివర్సిటీలో బాధ్యతలు, ఇటు టి.టి.డి. కార్యక్రమాలు, ఇంకొకప్రక్క మందిర నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు... ఒక్కటేమిటి, ఎన్నెన్నో అన్నీ ఒకేసారి చుట్టుముట్టాయి. పరీక్షలు పెట్టేవాడు ఆయనే, పాస్ చేసేవాడూ ఆయనే. నేనెందుకు భయపడాలి! అనుకొన్నాను. అన్నింటికీ "నీవే తప్ప నితః పరంబెరుగన"నే శరణాగతి మంత్రం ఉండనే ఉన్నది.

నవంబరు పధ్నాలుగో తేదీ ఉదయం 4.45 నిమిషములకు తిరుపతి - పుట్టపర్తి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణమని నేను శ్రీమతి అనుకొన్నాం. యూనివర్సిటీలో చాలా ముందుగా అప్లై చేసిన లీవ్ ఎప్పుడో మంజూరైంది. కానీ, 13వ తేదీ రాత్రి పది గంటలవరకు నేను తప్పనిసరిగా పూర్తి చేసి అప్పగించవలసిన రచనలు, వగైరా పూర్తికాలేదు.

13వ తేదీ రాత్రి నా శ్రీమతితో అన్నాను, "స్వామి పధ్నాలుగవ తేదీకి రమ్మన్నారుగాని నా పనులు అలాగే మిగిలి ఉన్నాయి. రేపు ఉదయానికిగాని అయ్యేటట్లు లేవు. ఉదయం బస్సులో బయలుదేరటం కష్టమవుతుంది."

తెల్లవారింది. యూనివర్సిటీకి వెళ్ళాను. అనుకున్నదాని కంటే సులభంగా పనులైపోయినాయి. టి.టి.డి.కి వెళ్ళాను. అంగీకరించిన బాధ్యతను పూర్తిచేసి అధికారులకు అప్పగించాను. ఇంటికి వచ్చాను. సమయం మధ్యాహ్నం 1 గంట అయింది. స్వామి అనుగ్రహంవల్ల నా పనులన్నీ తేలికగా అయిపోయినాయి. ఇప్పుడు నేను సిద్ధంగా ఉన్నాను. "వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు వెడదామా?" అన్నాను నా భార్యతో. నేనెప్పుడలాంటి మాట అంటానా అని ఎదురు చూస్తున్న ఆమె వెంటనే సరేనన్నది.

భోజనం చేసి రైల్వే స్టేషన్‌కి చేరాము. ముందురోజు వెళ్ళవలసిన శ్రీ కె.ఆర్. వెంకటేశం దంపతులు ఆరోజు స్టేషనులో కలిశారు. అదీ స్వామి నిర్ణయమే అనుకొన్నాము. స్వామి అనుగ్రహంవల్ల జరిగే ఏర్పాట్లు మన ఊహకు అందనివి. వారితోబాటు ప్రశాంతినిలయం చేరేటప్పటికి రాత్రి 11 గంటలైంది. 14వ తేదీ పోయి 15వ తేదీ రావటానికి ఇంకా ఒక గంట టైముంది. ఆగస్టులో స్వప్నంలోనూ, సెప్టెంబరులో ఇంటర్వ్యూలోనూ చెప్పిన మాట "ఫోర్టీన్త్ కే రావాలి" అని. కానీ, నేనెదుర్కొనవలసి వచ్చిన పరీక్షలలో ఆనాటికి పుట్టపర్తికి చేరగలనా అని నాలో నేను చాలా మథనపడ్డాను. "నా మాట సత్యం, నా బాట సత్యం, నేనే సత్యం" అని స్వామి చెప్పారు కదా. అందుకని వారు చెప్పిన మాటని వారే నిలబెట్టుకొంటారు, నా వంతు కర్తవ్యాన్ని నేనాచరిస్తాను అని నా కృషి నేను చేశాను. స్వామి తమ మాట నిలబెట్టుకొన్నారు. 14వ తేదీ చివరి క్షణాలలో మమ్మల్ని పుట్టపర్తిలో నిలబెట్టారు. ఆహా! సత్యస్య సత్యం అంటే ఇదే కదా!

ఇంతవరకు బాగానే ఉంది. 15వ తేదీ ఉదయం ప్రశాంతి మందిర వరండాలో స్వామి దర్శనంకోసం వేచి ఉన్నాను. ఎందరో పెద్దలు, దేశ విదేశాల ప్రముఖులు విచ్చేశారు. నదులన్నీ సముద్రంలో ప్రవేశించినట్లు ఎన్నో దేశాలనుండి ఎన్నెన్నో రాష్ట్రాలనుండి సామాన్యులనుంచి ధీమాన్యులవరకు అసామాన్యమైన సంఖ్యలో జనప్రవాహం ప్రశాంతినిలయం చేరిపోతున్నది. దర్శన మివ్వటానికి స్వామి బయటకు వచ్చారు. అలా అలా అందమైన అడుగులు వేసుకుంటూ, అందరికీ ఆనందాన్నందిస్తూ ఎందరినో పలుకరిస్తూ వచ్చారు. నన్ను తేరిపార చూశారు. కానీ, పలుకరించలేదు. మందిరంలోకి వెళ్ళిపోయినారు. వారి లీలలు అలాగే ఉంటాయి. అవి అనుభవించినవారికే సరిగా అర్థం కావు. అసలే తెలియనివారికి తెలియటానికి అవకాశమే లేదు. రోజులో వారాలో నెలలో సంవత్సరాలో లేక జన్మలో వేచి ఉండాలి. అంతే! అది పూర్తిగా వారి దయమీద ఆధారపడి ఉంటుంది.

సాయంకాలం దర్శనంకోసం అందరం మందిరానికి చేరాం. దివ్యసుందరమూర్తి సందర్శనం అయింది. కానీ

పలుకే బంగారమైంది. నన్ను నేనే నిందించుకొన్నాను. మరల తమాయించుకొన్నాను. నీవేమి చేసినా మా మంచికేలే స్వామీ అని సరిపెట్టుకున్నాను. 15వ తేదీ గడిచిపోయింది.

16వ తేదీ ఉదయానికి వరండా క్రిక్కిరిసిపోయింది. అలాగే అందులో ఇరుక్కొని కూర్చున్నాను. నా స్వామి ఇవాళైనా పలుకరిస్తారా అని అడుగుతున్నది మనస్సు. ఎవరికి తెలుసు ఆ పరమాత్మకు తప్ప. లక్షలాది భక్తులకు తమ దివ్యదర్శన భాగ్యాన్నందించటానికి విచ్చేశారు స్వామి. అందరికీ దర్శనమిచ్చి లోపలికి వెడుతున్నారు. ఇంతలో చటుక్కున నావంక చూశారు. విద్యార్థుల మధ్య దోవ చేసుకొని వరండా మధ్యలో ఉన్న నావైపు వస్తున్నారు. ఆహా! ఎంత ఆనందం! స్వామికి ఎంత దయ! జగన్నాటక సూత్రధారి, మాయగోపాలుడు ఏమీ తెలియనట్లు, "ఎప్పుడొచ్చావ్?" అన్నారు. "స్వామీ, మీ ఆదేశాన్ని అనుసరించి ఫోర్టీన్త్ కే వచ్చాను" అన్నాను. "పోయి శాంతివేదిక దగ్గర ఉండు. నేను పది గంటలకు వస్తాను" అని ఆజ్ఞాపించారు.

స్వామి ఆదేశం ప్రకారం శాంతివేదికను చేరుకున్నాను. ఎన్నాళ్ళుగానో ఎదురుచూసిన సేవాభాగ్యం దొరికింది. స్వామి ఆగస్టులో స్వప్నంలోను, సెప్టెంబరులో ఇంటర్వ్యూలోనూ చెప్పిన మాట నవంబరులో నిజం చేశారు. స్వామి ఎప్పుడు చెప్పినా సత్యమే. ఏమాత్రం సందేహమే లేదు. 16వ తేదీనుండి 25వ తేదీవరకు ఉదయం ప్రశాంతినిలయం మందిరంలోను, సాయంకాలం శాంతివేదికపైన భగవాన్ దివ్య సందర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యాలను అందుకొంటున్న మధురాతి మధుర క్షణాలలో షష్టిపూర్తి నాటికి అరవై పద్యారవిందాలను స్వామి దివ్యపాదారవిందాల సన్నిధిలో సమర్పించాలనే సంకల్పం అంకురించింది. దానికి శ్రీవారి దివ్యసంకల్పం కూడా తోడైంది. అలా స్వామి దివ్యచరణ సన్నిధిలో కూర్చొని నిర్మలమైన చిత్తవృత్తితో భక్తిభావబంధురమైన ప్రపత్తితో వ్రాసుకొన్న అరవై పద్యారవిందాలకు 'సౌందర్య సుషమ' అని పేరుపెట్టి శ్రీవారి పాదపద్మ సన్నిధిలో సమర్పించాను. 'సుషమ' అంటే ప్రకాశం. త్రిభువన సుందరమూర్తి, ముల్లోకాలకు వెలుగు నిచ్చే దివ్య ప్రకాశ రూపి అయిన పరమాత్మ భగవాన్ శ్రీ సత్యసాయినాథుడని నా భావన. అందుకే అది "సౌందర్య సుషమ" అయింది.

నిత్య నిర్మలమైనట్టి నీదు రూపు
పండువెన్నెల మరపించు నిండు నవ్వు
ప్రకృతి నెచ్చోట జూచిన ప్రతిఫలించు
శాంతి సుఖదాయి కావుము సత్యసాయి

ఆదిదేవుడు హాయిగా అవతరించె
ఈశ్వరాంబను తల్లిగా ఇలను నిల్పి
ఈశ్వరుని అంబ కాదొకో ఈశ్వరాంబ
సత్యసాయియె దేవుడు సత్యముగను

సత్యధర్మాల త్రేతలో చక్కబరచి
శాంతి ప్రేమల తర్వాత చాటిచెప్పి
కలియుగంబున నాల్గిటి కరుణతోడ
మనకు దయసేయ నేతెంచె మరల సాయి

విష్ణువందురు కొందరు విమల భక్తి
శివుడె యందురు సాయిని చిద్విలాసు
పద్మభవుడంచు కొందరు బ్రస్తుతింత్రు
ముగ్గురకు మూలమితడౌను మోక్షదాత

శాశ్వతానందసంధాయి సత్యసాయి
దివ్యరూపాన దయచేసె దీప్తిమీర
సజ్జనుల గాచి దుష్టుల చలము మాన్పి
ధర్మసంస్థాపనము జేయ ధరణిపైన

సాయికృష్ణుని అవతార సమయమందె
పుట్టి ఆ స్వామి కనుగొను పుణ్యమబ్బె
సఫలమాయెను జన్మము సత్యవిభుని
పాదపద్మాల సేవలో పరమభక్తి

పర్తి నిక్కము పరమమౌ పదము చూడ
పర్తినాథుడె పరమాత్మ పతియు గతియు
ఆర్తి సేవింపుడీతడు ఆర్తసఖుడు
నిత్య సత్య ప్రతిజ్ఞుడు సత్యసాయి

(ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్యగారు 1995 - 99 సం॥ల నడుమ రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి వైస్ ఛాన్సలర్‌గా సేవలందించారు) ❖

అవతార వైభవంలో అద్భుత ప్రదేశాలు:

10. సాండూరు సంస్థానంలో సర్వజ్ఞ సాయి

పి.వి. చలం

భగవాన్ బాబావారు సర్వజ్ఞులు, సర్వాంతర్యామి. భూత భవిష్యత్ వర్తమానములు వారి అధీనంలో ఉన్నాయి. తత్సంబంధమైన దృష్టాంతాలను 'అవతార వైభవంలో అద్భుత ప్రదేశాలు' అన్న ఈ శీర్షికలో మనం ఎన్నో ప్రస్తావించుకోవడం జరిగింది. సందర్భోచితం కాబట్టి అటువంటి సంఘటన నొకదానిని ఇక్కడ పునశ్చరణ చేసుకుందాం. ఆ సంఘటనకు ప్రస్తుతం మనం ముచ్చటించుకోబోయే సంఘటనతో గల అవినాభావ సంబంధాన్ని పాఠకులు కథాగమనంలో గుర్తించగలరు. రండి... ఆ సంఘటనలోకి వెళదాం.

భగవాన్ బాబావారు ఉరవకొండలో 'సత్యం' నామంతో విరాజిల్లుతున్న సమయమది. భారత స్వాతంత్ర్య పోరాటం ఉద్ధృతంగా జరుగుతున్న రోజులవి. దివ్య బాలుడైన 'సత్యం' ఆనాడే తమ సర్వజ్ఞత్వాన్ని వెల్లడి చేస్తూ భక్తులకు అనేక దివ్యానుభవాలను ప్రసాదిస్తున్న తరుణంలో ఒకనాడు ఉరవకొండ స్కూలు విద్యార్థి నాయకుడైన అబ్దుల్ ఖాదర్, "సత్యం! మన దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వస్తుంది?" అని అడిగాడు. "మనం 1947 ఆగస్టు 15వ తేదీనాడు స్వాతంత్ర్య ఉత్సవాలు జరుపుకోబోతున్నాము" అని ఠక్కున జవాబిచ్చారు 'సత్యం'.

'సత్యం' మాటలు ఎప్పుడూ యథార్థాలై విరాజిల్లటం అనుభవైకవేద్యమే కదా! దేశ స్వాతంత్ర్యం విషయంలోనూ అదే యథార్థత ప్రతిఫలించి భారతీయుల చిరకాల మధుర స్వప్నం సాకారమై స్వతంత్ర భారతావని ఏర్పడింది.

స్వాతంత్ర్యం సిద్ధించిన అనతికాలంలోనే భారత ప్రభుత్వంవారు మహారాజులు, జమిందారులు మొదలైనవారి పాలనలో ఉన్న ప్రాంతాలను 'ఇండియన్ యూనియన్'లో విలీనం చేయాలని నిర్ణయించి ఆయా పాలకులకు వర్తమానాలు పంపడంతో సాండూరు రాజదంపతులు తమ భవిష్యత్తునుగురించి ఆందోళన చెందుతూ వచ్చారు. పరిస్థితులు ఇలా కొనసాగుచుండగా...

సాండూరు మహారాణిగారికి శ్రీ శిరిడీ సాయిబాబా వారు, శ్రీ సత్యసాయిబాబావారు స్వప్నంలో రాసాగారు. ఒకరోజు రాణిగారి స్నేహితురాలైన రుక్మిణి దేశిరాజ్ అర్స్‌గారు ఫోను చేసి, భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు త్వరలో బెంగళూరు రానున్నారని, ఆ సమయంలో వారు తమ గృహంలో విడిది చేస్తారు కనుక, వచ్చి దర్శనం చేసుకొమ్మని ఆహ్వానించారు. బాబావారిని ప్రార్థించి తమ సమస్యకు పరిష్కారం పొందవచ్చునన్న ఆశతో సాండూరు మహారాణిగారు 1948 జనవరి 8వ తేదీన రుక్మిణి దేశిరాజ్ అర్స్‌గారి ఇంటికి వెళ్ళి బాబావారిని దర్శించుకున్నారు. ఆ తొలి దర్శనంలోనే, బాబావారు సాక్షాత్ భగవంతుడే అన్న దృఢ విశ్వాసం ఆమెకు ఏర్పడింది. బాబావారు సరాసరి మహారాణి గారి వద్దకు వచ్చి బొటనవేలుతో ఆమె నొసటన

భగవానుల దివ్యపాదస్పర్శతో పునీతమైన సాండూరు రాజసౌధం

కుంకుమపెట్టి, "ఇప్పుడున్న పరిస్థితికన్న వందరెట్లు ఉన్నత స్థితిని పొందుతారు" అని ఆశీర్వదించారు.

అప్పటినుండి ఆమెలో తన భర్తతో కలసి పుట్టపర్తికి వెళ్ళాలన్న ఉత్సుకత ద్విగుణీకృతమైంది. సాండూరు వెళ్ళిన తరువాత భర్తకు విషయాలు విన్నవించగా, ఆధ్యాత్మికతపట్ల అంతగా సుముఖత లేని మహారాజాగారు, బాబావారి దివ్యసంకల్ప ప్రభావమా అన్నట్లు వెంటనే పుట్టపర్తి ప్రయాణానికి అంగీకరించారు.

ఫిబ్రవరి నెలలో పుట్టపర్తిని సందర్శించటానికి రాజదంపతులు నిశ్చయించుకున్నారు. కానీ, సరిగ్గా అదే సమయంలో ఢిల్లీకి రావాలని ప్రభుత్వ ఆదేశాలు అందటంతో పుట్టపర్తి యాత్రను వాయిదా వేసుకోక తప్పలేదు. మహారాణిగారు తాము పుట్టపర్తికి రాలేకపోతున్న కారణాన్ని వివరిస్తూ, క్షమాపణలు చెప్పుకుంటూ ఒక ఉత్తరం వ్రాసి, బాబావారికి వ్యక్తిగతంగా అందించటానికి ఒక వ్యక్తిద్వారా పంపారు.

మహారాణిగారి ఉత్తరం తీసుకొస్తున్న వ్యక్తి బస్సులో పుట్టపర్తికి బయలుదేరాడు. ఆ బస్సు బుక్కపట్నం సమీపిస్తుండగా ఎదురుగా ఒక కారు వచ్చింది. ఆ కారు డ్రైవరు బస్సును ఆపి, "సాండూరు మహారాణిగారి వద్దనుంచి ఉత్తరం తీసుకొస్తున్న వ్యక్తిని బాబావారు పిలుస్తున్నార"ని చెప్పటంతో, తనను మహారాణిగారు పంపిన సంగతి బాబావారికి ఎలా తెలిసింది? అని ఆశ్చర్యపోతూ ఆ వ్యక్తి బస్సు దిగగానే బాబావారు, "రాణీగారు పంపిన ఉత్తరం ఇటు ఇవ్వు" అంటూ ఆ ఉత్తరాన్ని తీసికొని దానిని తెరవకుండానే, "ఆమె ఎప్పుడు రాగలిగితే అప్పుడు రమ్మను" అని చెప్పి కారులో ముందుకు సాగారు. సాండూరు తిరిగి వెళ్ళిన వార్తాహరుడు సంభ్రమాశ్చర్యాలతో జరిగిన విషయాన్ని పూసగ్రుచ్చినట్లు వివరించగా రాజదంపతులు ఆనందాబ్ధిలో ఓలలాడారు.

పుట్టపర్తి ప్రయాణం

ఒకరోజు మహారాజాగారు భగవాన్ బాబావారికి తెలియజెయ్యకుండానే మందీమార్బలంతో బయల్దేరి, కార్లను చిత్రావతి ఆవలి ఒడ్డున నిలిపి, చిత్రావతిని దాటి పుట్టపర్తికి చేరుకున్నారు. అయితే, అప్పటికే బాబావారు రాజాగారి పరివారం విడిది చేయటానికి వసతి సిద్ధం చేయించి ఉంచడం వారిని ఆశ్చర్యచకితుల్ని చేసింది.

అక్కడి పవిత్ర ప్రశాంత వాతావరణం, బాబావారే భజనలు లీడ్ చేయటం చూసి రాజదంపతులు విస్మయం చెందారు. ఆరోజు రాత్రి బాబావారు రాజదంపతులతో ప్రత్యేక సంభాషణ సలుపుతూ, "మీగురించి నేను చూసుకుంటాను, ఆందోళన చెందకండి" అని అభయం ప్రసాదించారు.

రాజదంపతుల ప్రార్థనను మన్నించి 1948 జూన్ 17వతేదీన భగవాన్ బాబావారు సాండూర్ సంస్థానాన్ని సందర్శించినప్పుడు రాజదంపతులు ప్రధాన ప్రవేశద్వారం వద్ద బాబావారి పాదపద్మాలను అభిషేకించి, పసుపు కుంకుమలతో అలంకరించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

భగవాన్‌కు భక్తిపూర్వకంగా స్వాగతం పలుకుతున్న సాండూర్ రాజదంపతులు

స్వామివారు సాండూరులో విడిదిచేసిన నాలుగు రోజులలో క్రొత్త రాజమహల్‌లో స్వయంగా దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. క్రొత్త మహల్‌లో రాజసింహాసనాన్ని ప్రతిష్ఠించిన తరువాత మహారాజాగారు బాబావారిని ముందుగా ఆ సింహాసనాన్ని అధిష్ఠించ వలసిందిగా వేడుకోగా, ఆయన తృప్తికోసం బాబావారు సింహాసనాన్ని అధిష్ఠించి పావనం చేశారు.

బాబావారు ఒకరోజు మహారాణిని పిలిచి, “అమ్మా, ఇది తీసుకో” అన్నారు. రాణీగారు సంప్రదాయబద్ధంగా చీరకొంగు పట్టగా, “అలా కాదు, ఒక టవల్ తీసుకురా” అన్నారు. వెంటనే బాబావారి చేతిలో అప్పుడే నిప్పుల కొలిమిలో నుంచి తీసినట్లున్న ఏడు అంగుళాల పొడవుగల శ్రీకృష్ణుని విగ్రహం ప్రత్యక్షమైంది. కనీ వినీ ఎఱుగని ఈ అద్భుత దృశ్యాన్ని, ఆ సుందరమైన విగ్రహాన్ని చూసి మంత్రముగ్ధులైనారు ఎల్లరూ. ఆ విగ్రహాన్ని మహారాణిగారు తెచ్చిన టవల్‌లో వేయగా, అంత వేడిగా ఉన్న విగ్రహాన్ని బాబావారు వట్టి చేతులతో పట్టుకోవడం మరింత దిగ్భ్రాంతి కలిగించింది. మర్నాడు ఆ కృష్ణ విగ్రహాన్ని బాబావారు స్వయంగా పూజామందిరంలో ప్రతిష్ఠించారు.

భగవాన్ బాబావారు సాండూరు పర్యటన ముగించుకొని తిరిగి పుట్టపర్తికి వెళ్ళేటప్పుడు గౌరవసూచకంగా రాజదంపతులు పుట్టపర్తి వచ్చి బాబావారివద్ద సెలవు తీసుకొని వెళ్ళారు.

సర్వమత సాయి

మహారాజాగారికి కెప్టెన్ ఎస్.ఎ. జబ్బార్ సాహెబ్ అనే సహాయకుడు ఉండేవాడు. తొలుత ఆయనకు బాబావారి దివ్యత్వంపట్ల అంత నమ్మకం ఉండేది కాదు. ఆరోజుల్లో బాబావారు భక్తులను ఆంతరంగిక సంభాషణకోసం హాలులో కర్టెన్ కట్టి ఉన్న ప్రదేశానికి పిలిచేవారు. ఒకరోజు జబ్బార్ గారిని కూడా పిలిచారు. కర్టెన్ వెనక్కి వెళ్ళగానే బాబావారు అతనికి తమ వక్షస్థలాన్ని చూపారు. ఉర్దూలో ‘అల్లాహు అక్బర్’ అన్న సువర్ణాక్షరాలు బాబావారి వక్షస్థలంపై ప్రత్యక్షమైనాయి. అనూహ్యమైన ఈ అద్భుత సంఘటనతో జబ్బార్ ఆనాటి నుంచి స్వామి భక్తునిగా మారిపోయారు.

కెప్టెన్ ఎస్.ఎ. జబ్బార్

ఒకరోజు జబ్బార్‌గారి సతీమణికి ఉన్నట్లుండి బాబావారిని దర్శించుకోవాలన్న కోరిక కలిగింది. అటువంటి శుభ పరిణామంకోసమే ఎదురుచూస్తున్న జబ్బార్‌గారు వెంటనే ఆమెను బెంగళూరులో ఉన్న బాబావారివద్దకు తీసుకువెళ్ళారు. ఆ సమయంలో భజన జరుగుతోంది. జబ్బార్‌గారు పురుషులవైపుకు, ఆయన భార్య స్త్రీలవైపుకు వెళ్ళారు. అక్కడి విషయాలేమీ తెలియని కారణాన జబ్బార్‌గారి భార్య ఒక ప్రక్కగా నిలబడ్డారు. స్వామివారు సరాసరి ఆమె వద్దకు వచ్చి ఒక రక్ష సృష్టించి ఆమెకిచ్చి ఆశీర్వదించారు. కొద్ది రోజులలోనే ఆమె విపరీతమైన మలేరియా బారినపడినా స్వామివారు ఆమెకు ప్రసాదించిన ‘రక్ష’యొక్క దివ్యప్రభావంవలన అనతి కాలంలోనే సంపూర్ణ ఆరోగ్యవంతురాలయ్యారు.

బాబావారు ఆమెకు రాబోయే అనారోగ్యం నుంచి కాపాడటానికే ఆమెలో ప్రేరణ కలిగించి, తమ సమక్షానికి రప్పించుకొని, ‘రక్ష’ నొసగి రక్షించిన వైనం, వారు సర్వదేవతాతీతస్వరూపులే కాదు, సర్వమతాతీతస్వరూపు లన్న సత్యానికి అద్దం పడుతున్నది కదా!

ఆశ్రిత కల్పతరువు

ఇక, అనన్యభక్తితో తమ దివ్యచరణ కమలాలను ఆశ్రయించిన సాండూర్ రాజదంపతుల యోగక్షేమాలను అన్నివిధాలుగా చూసుకుంటూ భగవానులు వారికి

భగవాన్ దివ్యచరణ సన్నిధిలో
సాండూర్ రాజ కుటుంబం (1948)

ప్రసాదించిన దివ్యానుభవాలను మహారాణి శ్రీమతి సుశీలా దేవి గోర్పేడ్ గారి మాటల్లోనే తెలుసుకుందాం....

"1948లో మేము భగవాన్ బాబావారి సన్నిధికి చేరినప్పటినుండి ప్రతి విషయంలోనూ బాబావారు దివ్యమార్గనిర్దేశకులుగా మమ్మల్ని అనుగ్రహిస్తూ వచ్చారు. బాబావారి దివ్యసమక్షంలో మేము అనేక విషయాలు నేర్చుకునే అదృష్టానికి నోచుకున్నాం. ఎవరైనా సరే, భగవాన్ బాబావారి దివ్య పాదపద్మముల నాశ్రయించిన తరువాత పూర్తిగా పరివర్తన చెందటం తథ్యం.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి మేము సాండూరు రాజ్యపాలకులుగా ఉన్నాం. కొత్తగా ఏర్పడ్డ భారత ప్రభుత్వం నిర్ణయం మేరకు సాండూరు రాజ్యాన్ని అఖండ భారతావనిలో విలీనం చేశాము. అప్పుడు మా రాజకుటుంబం భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. అదివరకు అనుభవించిన రాచరికపు భోగభాగ్యాలు, హోదా మొదలైనవాటిని ఒక్కసారిగా వదలి మామూలు జీవితానికి అలవాటుపడటం కష్టతరమైన విషయం కదా! రాజ్యం కోల్పోయిన తరువాత మేము ఏదో ఒకటి చేయాలి కదా! ముఖ్యంగా మా పిల్లల భవిష్యత్తు కోసం ఎటువంటి ప్రణాళికలు రూపొందించాలన్న ఆలోచనలో పడ్డాము.

ఆ సమయంలో నా భర్త శ్రీ యశ్వంతరావు గోర్పేడ్‌గారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యచరణ సన్నిధిని ఆశ్రయించారు. ఆ సమయంలో బాబావారి వయస్సు కేవలం 21 సంవత్సరాలు. బాబావారు మా స్వస్థలంలో ఒక పరిశ్రమను స్థాపించమని నా భర్తకు సూచించారు. ఒక రాజ్యాన్ని పరిపాలించటం వేరు, ఒక పరిశ్రమను నడపటం వేరు. అయినా బాబావారి ఆదేశాన్ని శిరసావహించి, సాండూరు ప్రాంతంలో గనులు, ఖనిజాలకు సంబంధించిన పరిశ్రమను స్థాపించదలచి, భారత ప్రభుత్వానికి గనుల లీజుకోసం అభ్యర్థనను పంపించగా అప్పటి భారత ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూగారు సానుకూలంగా స్పందించారు. నిజానికి అక్కడ గనుల లీజు రావాలంటే చాలా కష్టం. ఎందువలనంటే, అక్కడ గనులలో మాంగనీసు, ఇనుము నిక్షేపాలు అపారంగా ఉండటంవల్ల ఆ లీజు దక్కించుకోవటానికి విపరీతమైన పోటీ ఉండినది. భగవాన్ బాబావారి అభయ ఆశీర్వాదములతోనూ అంతా సజావుగా జరిగి మైనింగ్ అండ్ మెటలర్జికల్ పరిశ్రమను ప్రారంభించగలిగాం. భగవాన్ బాబావారు మా మైనింగ్ అండ్ ఫెర్రో ఎల్లాయ్ పరిశ్రమను 1974లో తమ దివ్యపాదస్పర్శతో పునీతం చేసి మమ్మల్ని ఆశీర్వదించారు.

మేము భగవాన్ బాబావారి దివ్యమార్గనిర్దేశనంలో ఎన్నో అమూల్యమైన జీవిత పాఠాలు నేర్చుకున్నాం. భగవాన్ సన్నిధిలో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతను పొందుతారు. ఈ విశాల ప్రపంచం

నలుమూలల నుంచి జనులు భగవాన్ సన్నిధికి వచ్చేది ఆ మానసిక ప్రశాంతతకోసం, తద్వారా కలిగే హృదయ పరివర్తనకోసమే కదా! నిజంగా మనం ఎంతో అదృష్టవంతులం. భగవాన్ సమకాలీనులుగా పుట్టి, భగవాన్ దరిచేరి, వారి అభయ ఆశీర్వాదాలను సంపూర్ణంగా పొందగలుగుతున్నాం.

1972లో బృందావన్‌లో వేసవి శిక్షణా తరగతులు జరుగుతున్న రోజులవి. ఒకరోజు భగవాన్ బాబావారు అక్కడున్న భక్తులందరికీ మామిడి పండ్లను పంచి, ఒక పండును మాత్రం తమ చేతిలో ఉంచుకొని అటూ ఇటూ త్రిప్పుతూ ఆడుతున్నారు. ఆ దృశ్యం అక్కడున్న వారందరిలో ఆ పండును భగవాన్ ఎవరికిస్తారా? అన్న ఉత్సుకతను రేకెత్తిస్తోంది. ఆరోజు మేము మార్గమధ్యంలో రైల్వే గేటు పడటంవల్ల బృందావన్ చేరుకోవటం కాస్త ఆలస్యమైంది. భగవాన్ నా భర్తను చూడగానే నేరుగా ఆయనదగ్గరకు వచ్చి ఆ మామిడి పండు చేతిలో పెట్టారు.

మరుసటిరోజు భగవాన్ బాబావారు ముంబైలోని ‘ధర్మక్షేత్ర’ వార్షికోత్సవంలో పాల్గొనటానికి వెళ్ళవలసి ఉండినది. ఆరోజు బాబావారి దివ్యోపన్యాసం తరువాత మేము బెంగళూరులోని మా నివాసానికి తిరిగి వచ్చాము. మావారు నాతో, “భగవాన్ నాకు మామిడి పండు ఇచ్చారు. నీకు ఇవ్వలేదా?” అన్నారు. ఆ పండును ఇద్దరం ప్రసాదంగా తిందామన్నారు. కానీ, భగవాన్ చర్యలలో కచ్చితంగా ఏదో ఒక అంతరార్థం ఉంటుంది. ఆ పండును బాబావారు తమ స్వహస్తాలతో మీకే ఇచ్చారు కాబట్టి, మీరే తినాలి అని నేను పట్టుబట్టాను.

మర్నాడు ఉదయం నిద్రనుండి లేచిన తరువాత ఆయన ముఖ ప్రక్షాళనకోసం బాత్‌రూమ్‌కి వెళ్ళి అద్దంలో చూసుకోగా, ముఖం వంకర తిరిగి ఉండటం గమనించి, పక్షవాతం వచ్చిందని గ్రహించారు. డాక్టర్లు వచ్చి పరీక్షించి, ఇది నయం కావటానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేమన్నారు. చికిత్స ఆరంభిస్తూ బయట చల్లగాలిలో తిరగవద్దని, వీలున్నంతవరకు వెచ్చగా ఉన్నచోట ఉండమని సలహా ఇచ్చారు.

రెండు రోజుల తరువాత భగవాన్ బాబావారు బొంబాయి నుంచి తిరిగి వచ్చారు. నేను డాక్టర్ల సలహాను పక్కనపెట్టి అద్దాలు మూసిన కారులో మావారిని వైట్‌ఫీల్డు తీసుకువెళ్ళాను. భగవాన్ మావారిని దూరం నుంచి చూసి దగ్గరకు వచ్చి, “ఏమయింది నీ ముఖానికి?” అని అడిగారు. “డాక్టర్లు ముఖానికి పక్షవాతం వచ్చిందంటున్నారు స్వామీ” అని చెప్పారు మావారు.

బాబావారు నవ్వి పక్షవాతం వచ్చి వంకరపోయిన చెంపమీద ఒక దెబ్బ వేశారు. ఆ దెబ్బతో తక్షణం ముఖం మామూలుగా అయింది. ఆ తరువాత బాబావారు వేదికపైకి వెళ్ళి తమ దివ్యోపన్యాసం అనుగ్రహించారు. వారి దివ్యప్రసంగానంతరం మేము ఇంటికి తిరిగి వచ్చేశాము.

మర్నాడు ఉదయం రోజూ పరీక్షించటానికి వచ్చినట్లే డాక్టర్లు వచ్చి, పక్షవాతం నుంచి పూర్తిగా కోలుకున్న మావారిని చూసి ఆశ్చర్యపోయారు. జరిగిన విషయమంతా విని, ఆ గదిలో ఉన్న స్వామివారి ఫోటో వద్దకు వెళ్ళి ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ, “ఇటువంటి అద్భుతాన్ని భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు మాత్రమే చేయగలరు” అన్నారు.

నయం కాని ఎన్నో దీర్ఘకాల వ్యాధులు కేవలం భగవాన్ బాబావారి దివ్యాశీస్సులతో నయం కావటం సర్వసామాన్యం. మావారి విషయంలో జరిగిన మరో అద్భుతం వివరిస్తాను. వారి జీర్ణకోశంలో ట్యూమర్‌ను గుర్తించారు. అది ‘మాలిగ్నెంట్’ ట్యూమర్. అంటే, క్యాన్సర్ కారక ట్యూమర్ అన్నమాట. ఆ విషయాన్ని వైద్యులు ధ్రువీకరించారుకూడా. అప్పుడే నేను, మావారు కలసి భగవాన్ దర్శనార్థం పుట్టపర్తి వెళ్ళాం. బాబావారు నా భర్తను చూడగానే, “ఏమి సమాచారం?” అని అడిగారు. వెంటనే ఆయన,

"స్వామీ, డాక్టర్లు నాకు ఆపరేషన్ చేయాలంటున్నారు" అని విన్నవించుకున్నారు. భగవాన్ మావారిని ఆశీర్వదించి, "ఏం భయం లేదు, ఆపరేషన్ చేయించుకో" అన్నారు. ఐతే, నేను ఊరుకోకుండా, "స్వామీ, అది కేన్సర్‌ట" అన్నాను ఆందోళనగా. వెంటనే భగవాన్ నావంక చూసి, "నేను అతని కేన్సర్‌ని కేన్సిల్ చేశాను. వెళ్ళు. నీ భర్తకు ఏమీకాదు" అంటూ విభూతి సృష్టించి ఇచ్చారు.

మేము బయలుదేరి బెంగళూరు వచ్చాము. డాక్టర్లు ఆపరేషన్‌కు తేదీ నిర్ణయించారు. కొడుకులు, కుమార్తెలు అందరూ వచ్చారు. మా పెద్ద కుమార్తె ఆపరేషన్ థియేటర్ బయట ఆత్రుతగా ఎదురు చూస్తున్న వాళ్ళ చిన్న చెల్లెలితో, "అమ్మకి ఈ ఆపరేషన్ ఎంత ప్రమాదకరమైనదో తెలియనట్లే ఉంది" అన్నది. అప్పుడామె తన అక్కతో, "అమ్మకి భగవాన్ బాబావారిపట్ల సంపూర్ణ విశ్వాసం ఉంది. అందువల్లనే అంత నిశ్చింతగా, ప్రశాంతంగా ఉంది" అని సమాధానం చెప్పింది.

భగవాన్ కృపతో ఆపరేషన్ విజయవంతమైంది. మావారు పూర్తిగా కోలుకున్నారు. అటు తరువాత 11 సంవత్సరాలపాటు కేన్సర్ జాడ లేకుండా ఆరోగ్యంగా, హాయిగా జీవించారు."

సత్యమైన మాట సాయిమాట

భగవాన్ దివ్యాశీస్సులతో సొండూరు మాజీ పాలకులు ప్రారంభించిన పరిశ్రమ మూడు పూలు, ఆరు కాయలుగా విరాజిల్లసాగింది. 1948లో సొండూరు మహారాణి తమను తొలిసారి దర్శించుకున్న సందర్భంలో స్వామివారు పలికిన దివ్యవాక్కులు యథార్థతను సంతరించుకున్నాయి. ఈ శుభపరిణామాలన్నీ తలచుకుంటుంటే,

"అల్ల పరమాత్మయను బొమ్మలాటగాడు
తాను జీవుల రంగస్థలాన నిలచి
ఆడు ఆనాటి ఈనాటి ఆటలరసి
సుంత వర్ణించి కొంత సంతసము గనుడి"

అన్న స్వామివారి అమృతవాక్కులు గుర్తుకొచ్చి,

"అల్ల పరమాత్మయైన సాయిపరంధాముడు
తాను సొండూరు సంస్థానమందు నిలచి
నెరపిన భక్తోద్ధరణ దివ్యానుగ్రహ లీలను
సుంత వర్ణింప కొండంత సంతసము కలిగె"

అన్న భావం మైమరపింపజేస్తూండగా, ఆ విరాట్ పురుషుని దివ్యమంగళస్వరూపం కనులముందు కదలాడి ఆనంద పారవశ్యంలో ఓలలాడిస్తుండగా మనస్సు ఆ మహావతారునికి జేజేలు పలకాలని ఉవ్విళ్ళూరుతూ...

ధర్మరక్షా సముత్పన్న సాయిరూప విరాజితా
జయము జయము... జయము జయము. ❖

భుజబలం, బుద్ధిబలం కన్న దైవబలం, ధర్మబలం మిన్న

భారత పవిత్ర చరిత్రలు మనకు అనేక అనుభూతులు అందిస్తున్నాయి. అనేక విద్యలార్జించిన రావణుడు, హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు మొదలైనవారు ధర్మస్వరూపులపై తలపడి ఏ ఫలితం పొందారో మనమూ అహంకారంతో విఱ్ఱవీగితే అదే ఫలితం. భుజబలం, బుద్ధిబలం కన్న దైవబలం, ధర్మబలం గొప్పదని తెలుసుకోవాలి. భారతంలో కృష్ణుడు దుర్యోధనునితో, "నావద్ద ఉన్నవి రెండే, ఒకటి నేను, రెండవది నా సైన్యము. ఏది కావాలి?" అని అడిగాడు. దుర్యోధనుడు భౌతిక ఫలాన్ని ఆశించి, "నాకు సైన్యం కావాలికాని, నాకు నీవేమి చెయ్యగలవు?" అన్నాడు. కౌంతేయుడు, "స్వామీ, నీవు ఒక్కడవు నాతో ఉన్నప్పుడు నాకు లోకమంతా సహాయం చేస్తుంది. యుద్ధభూమిలోనే కాదు, నా జీవితానికే సారథిగా రథంలో కూర్చుంటే చాలు. నీ సన్నిధే నా పెన్నిధి" అన్నాడు. దుర్యోధనుడు 'క్వాన్టిటీ' చూశాడు, అర్జునుడు 'క్వాలిటీ' చూశాడు. 'క్వాన్టిటీ' వల్ల ప్రయోజనం లేదు.

- శ్రీ సత్యసాయి

సాయివిద్యార్థి దివ్యస్మృతులు:

ప్రార్థనా పారిజాతాలు

❖ బాలరామచంద్రన్ ❖

ఒకానొక గురువుగారివద్దకు వెళ్ళి ఒక శిష్యుడు, "గురువుగారూ! నేను భగవద్గీత చదివాను" అన్నాడు. అప్పుడు ఆ గురువుగారు, "నాయనా! భగవద్గీత చదివాను అని ఎప్పుడూ అనకు. చదువుతున్నాను అను, ఎందుకంటే అది నిరంతరం చదువుతూ మననం చేస్తూ ఆచరణలో పెడుతూ ఉండవలసిందే తప్ప ఒకసారి చదివినంత మాత్రాన పూర్తిగా అవగాహనకుగాని, అనుభవానికిగాని వచ్చేది కాదు" అన్నారు.

అదేరీతిగా, నేను స్వామివారి దివ్యపదసన్నిధిలో నేర్చుకున్న విషయాలను కొన్నింటిని ఆచరణలో పెడుతూ, మరికొన్నింటిని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. స్వామివారి సాన్నిధ్యంలో నేను నేర్చుకున్న పాఠాలను ఏ కోణంలో అర్థం చేసుకొనగలిగానో వాటిని అదే కోణంలో మీ ముందుంచడానికి ప్రయత్నిస్తాను.

సాయిభక్తకోటికి సంజయ్ సహానీగారు సుపరిచితులు. స్వామివారు ఒకసారి ముంబై పర్యటనకు తమతోపాటు ఆయన్నికూడా తీసుకువెళ్ళారు. అక్కడ ఒకనాడు స్వామివారి దివ్యోపన్యాసానికి ముందు ఆయన ప్రసంగిస్తూ "ప్రేయర్ ఈజ్ మేన్స్ ఓన్లీ స్ట్రెన్త్ అండ్ గాడ్స్ ఓన్లీ వీక్‌నెస్", ప్రార్థన అనేది మానవునికి గల ఒకే ఒక బలము మరియు భగవంతునికి గల ఒకే ఒక బలహీనత అన్నారు. భక్తుడు హృదయపూర్వకంగా చేసే ప్రార్థనకు భగవంతుడు వశుడైపోతాడని దీని భావము.

సహానీగారు తన ప్రసంగంలో ప్రార్థనను మానవుని ఏకైక బలంగా చెప్పడంవరకు బాగానే ఉంది, కానీ అది భగవంతుడి బలహీనతకూడా అని సాక్షాత్తు భగవంతుడి సమక్షంలోనే చెప్పడం చాలామందికి ఆశ్చర్యం కలిగించి ఉంటుంది. ఐతే, ఆ సమావేశం తరువాత స్వామివారు తమ నివాస మందిరంలో భక్తులతో ముచ్చటిస్తున్నప్పుడు సంజయ్ సహానీగారి వంక చూసి మధుర మందహాసం చిందిస్తూ, "చక్కని భావం, ప్రార్థన.... భగవంతుడి బలహీనత" అన్నారు.

ప్రార్థనలోని అద్వితీయమైన శక్తిని మానవాళికి తెలియజేయటానికే భగవంతుడు ఈ వాక్యానికి తన ఆమోదం తెలియజేశాడని మనం గ్రహించాలి. ఈ సంఘటనని ఉదాహరించడానికి కారణం, నేను స్వామి దివ్యసన్నిధిలో పొందిన అనుభవాలను ఈ కోణంలోనే అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాను.

ఆధ్యాత్మిక మార్గంలో ప్రార్థన అత్యంత ప్రధానమైనది. ఈ సాధనామార్గానికి నన్ను స్వామి అనూహ్యమైనరీతిలో పరిచయం చేసి, దాని అమృతతుల్యమైన ఫలాలను నాకు ఎంతో ప్రేమతో అందించారు. స్వామివారు నాకు అనుగ్రహించిన ఒక శక్తివంతమైన సాధనామార్గం ఈ ప్రార్థన. భక్తులు చేసే ప్రార్థనలను తాము ఎంతో దయతో స్వీకరించి, దానికి తగినవిధంగా ప్రతిస్పందిస్తామనే నమ్మకాన్ని స్వామివారు కలుగజేస్తారు. అంతేకాదు, స్వామివారికి అసాధ్యమైనదంటూ ఏమీ లేదనే పరిపూర్ణమైన విశ్వాసాన్ని కూడా కలిగేటట్లు చేస్తారు.

ఈ విషయాన్ని ధ్రువపరచే సంఘటన ఒకటి మీకు తెలియజేస్తాను. నేను తొమ్మిదవ తరగతి చదువుతున్న రోజులలో మా నాన్నగారు కేరళలోని త్రిచూర్ అనే చిన్న పట్టణంలో పనిచేస్తూ ఉండేవారు. వారు నన్ను దగ్గరలోని

శ్రీ సత్యసాయి మందిరానికి తీసుకువెళుతూ ఉండేవారు. ఆవిధంగా నేను ఆరోజుల్లోనే స్వామివారి భజనలో పాల్గొనే అవకాశం పొందగలిగాను. ఐతే, అప్పటికింకా మా కుటుంబంలో ఎవరూ స్వామివారిని దర్శించుకోలేదు.

ఆ సమయంలోనే మా తల్లిగారికి గర్భాశయంలో నారింజకాయంత ఒక కణితి ఏర్పడినట్లు వైద్యులు నిర్ధారించారు. మందులవల్ల అది తొలగకపోతే శస్త్రచికిత్స తప్పదని చెప్పారు. ఇలా ఉండగా మా కుటుంబ సభ్యులు నలుగురం ఒక ఆదివారంనాడు స్వామిని ప్రార్థించటానికి భజనకు వెళ్ళాము. భజనలో ఎవరో 'దశరథనందన రామా దయాసాగరా రామా' అని పాడుతూ ఉండగా మా తల్లిగారికి భరించలేని కడుపునొప్పి కలిగింది. అతికష్టం మీద ఆమె భజన పూర్తికాగానే నాన్నగారివద్ద కారు తాళాలు తీసుకుని వెళ్ళి సీట్లో కూలబడిపోయారు. మేము కూడా వెళ్ళి కారులో కూర్చున్నాకా ఆమె తనకు కలిగిన తీవ్రమైన నొప్పిని గురించి చెప్పారు. ఆ క్షణంలో అనుకోకుండా నా నోటి వెంట, "అమ్మా! బహుశా స్వామివారు నీ పొట్టలోని కణితిని తీసేసి ఉండవచ్చు" అన్న మాటలు వెలువడ్డాయి. ఆ మాటలు స్వామివారే నాచేత పలికించారేమో!

ఆ మరునాడు మా అమ్మగారు ఆసుపత్రికి వెళ్ళారు. వైద్యులు మళ్ళీ స్కాన్ నిర్వహించారు, అత్యాశ్చర్యకరంగా స్కాన్‌లో వారికి కణితి కనిపించలేదు. అయితే స్కాన్ చేసే పరికరం సరిగ్గా పనిచేయనందువల్లనో, లేక పొట్టలో వాయువువల్లనో స్కాన్‌లో కణితి కనబడటంలేదని భావించి వారు ఆమెకు లాప్రోస్కోప్ పద్ధతిలో శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స చేసినప్పుడు వారికి కణితి కనిపించకపోవడమేకాక, అది తొలగింపబడినట్లుగా అక్కడొక మచ్చ కనిపించింది.

మా అమ్మగారికి స్పృహ వచ్చిన తరువాత ఆమె మాతో తనకు ఎనస్తీషియా ఇచ్చే సమయంలో భగవాన్ బాబావారు అభయహస్త ముద్రతో దర్శనమిచ్చి 'నేనుండగా భయ మెందుకు?' అన్నారని చెప్పారు. ఈ సంఘటన మేము స్వామిని తొలిసారి దర్శించకముందే జరిగింది. భగవాన్ తమ సంకల్పమాత్రాన భూమిని ఆకాశంగానూ, ఆకాశాన్ని భూమిగానూ మార్చగలిగిన అనంతశక్తిస్వరూపులని, మనం చేసే ప్రార్థనలన్నీ వారికే చేరుతూ ఉంటాయని నాకు అర్థమైంది. నేను బృందావన్‌లో చదువుతున్న రోజులలో ఒకసారి నాకు స్వామి సమక్షంలో ప్రసంగించే అవకాశం లభించినప్పుడు, వారి అనుమతితో మా తల్లిగారికి కలిగిన ఈ దివ్యానుభవం వివరించాను.

❖❖❖

మనం చేసే ప్రతీ చిన్న ప్రార్థనను భగవాన్ బాబావారు వింటారన్నదానికి, నా విద్యార్థి జీవితం నుండి కొన్ని ఉదాహరణలు తెలియజేస్తాను.

నేను బృందావన్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడు మేం ముగ్గురు మిత్రులం కలిసి చదువుకునేవాళ్ళం. వారిలో ఒక విద్యార్థి నాకు కేరళలో పాఠశాలస్థాయినుండి సహాధ్యాయిగా ఉన్నాడు. అయితే దురదృష్టవశాత్తు అతడు చెడు స్నేహాలకు గురియై ధూమపానానికి అలవాటుపడ్డాడు. బృందావనానికి వచ్చిన తరవాత కూడా ఈ దురలవాటును విడిచిపెట్టలేక పోయాడు. నిజానికి అతడికి స్వామివారి విద్యాసంస్థలో చదవడం ఏమాత్రం ఇష్టం లేదు. కానీ, తల్లిదండ్రుల బలవంతంమీద అతడు రాక తప్పలేదు.

ఆరోజు రాత్రి హాస్టల్‌లో భోజనాల అనంతరం మేం ముగ్గురం కలసి చదువుకుంటూ ఉండగా ఈ విద్యార్థి మాతో, "ఈ రోజు నేను ఆశ్రమం బైటకు వెళ్ళి సిగరెట్ కాల్చి వచ్చాను తెలుసా?" అన్నాడు గర్వంగా. నేను వెంటనే అతనితో, "నువ్వు చేసిన పని మంచిది కాదు. పట్టుబడితే ఇబ్బందికి గురి అవుతావు" అన్నాను. "ఇంతమంది విద్యార్థులలో నన్ను గమనించేదెవరు?!" అన్నాడతను ధీమాగా. "నీ సంగతి ఉపాధ్యాయులకు, వార్డెన్‌గారికి తెలియకపోవచ్చు, కానీ స్వామికి కచ్చితంగా తెలుస్తుంది" అన్నాను. అప్పుడు అతడు, "సరే, నేను స్వామిని సవాలు చేస్తున్నాను. నీవన్నట్లు నా విషయం స్వామికి తెలిస్తే, నన్ను ఈ అలవాటు మానేయమని ఆయన నాతో స్వయంగా చెపితే నేను తప్పక మానేస్తాను" అన్నాడు. "స్వామీ, వీడిని సన్మార్గంలో పెట్టే బాధ్యత మీదే" అని ప్రార్థించటం మినహా నేనేమీ చేయలేకపోయాను.

బృందావనంలో హాస్టలు డాబాపైన విద్యార్థులమంతా వరుసలలో కూర్చుంటే మాకు దర్శనానికి సంబంధించిన టోకెన్లు ఇవ్వబడేవి. వాటినిబట్టే మేము స్వామి దర్శనార్థం

'త్రయీ' మందిరంలో స్వామి సన్నిధిలో విద్యార్థులు

'త్రయీ మందిరం'లోకి వెళ్ళి కూర్చునేవాళ్ళం. ఒకనాడు మేం ముగ్గురు మిత్రులం ఒకే వరుసలో కూర్చోవడం, మా వరుసకు మొదటి టోకెన్ రావడం, 'త్రయీ'లో మేం ప్రక్కప్రక్కనే కూర్చోవడం యాదృచ్ఛికంగా, కాదు కాదు, దైవప్రణాళిక ప్రకారం జరిగిపోయింది. స్వామివారు వచ్చి ఉయ్యాలలో ఆసీనులై మా అందరితో చాలాసేపు మాట్లాడారు. తరువాత భజన జరిగింది. చివరన హారతి సమయం వచ్చింది. సాధారణంగా స్వామివారికి హారతిచ్చే అవకాశం రోజుకొక విద్యార్థికి లభించేది. స్వామివారే స్వయంగా హారతి వెలిగించి, ఆ అగ్గిపెట్టెను హారతిచ్చే విద్యార్థి జేబులో పెట్టేవారు. ప్రతి ఒక్కరూ దానిని ఎంతో భద్రంగా దాచుకునేవారు.

అయితే, ఆ రోజున స్వామివారు హారతి వెలిగించిన తరువాత అగ్గిపెట్టెను హారతిచ్చే విద్యార్థికి ఇవ్వకుండా, ముందు వరుసలో కూర్చున్న, మా హాస్టల్ గదిలో స్వామిని సవాలు చేసిన నా మిత్రుని వైపు విసురుతూ, "ఏయ్! నేను అగ్గిపెట్టె ఇచ్చానని సిగరెట్లు మాత్రం కాల్చకు" అన్నారు. ఈ మాట విన్న మిగిలిన విద్యార్థులంతా, స్వామి ఛలోక్తిగా అన్నారనుకుని ఘొల్లున నవ్వారు, కానీ మేం ముగ్గురు మిత్రులం మాత్రం స్థాణువులమై ఉండిపోయాం, ఎందుకంటే స్వామివారి వాక్కులలోని ఆంతర్యం మాకు మాత్రమే తెలుసు కాబట్టి. ఈ విషయాన్ని ఏదైనా పుస్తకంలో ఒక దివ్యమైన లీలగా చదవడం వేరు, కానీ యథార్థంగా ఇది కళ్ళముందే జరిగినప్పుడు కలిగే అనుభూతి వేరు.

ప్రార్థనకు ఉండవలసిన ప్రధాన లక్షణం పరిపూర్ణ విశ్వాసం. అది ఉంటే మనం ఎక్కడున్నా మన ప్రార్థన తప్పక స్వామికి చేరుతుంది. ఈ విషయాన్ని ధ్రువపరచే ఓ సంఘటన తెలియజేస్తాను.

బృందావన్ హాస్టల్‌లో నా గదిలోనే ఉన్న ఒక సోదరునికి 'ఫిట్స్' సమస్య ఉండేది. ఒకనాడతను స్నానానికని వెళ్ళి, ఎంతకీ తిరిగి రాలేదు. వెళ్ళి చూసేసరికి స్నానాల గదిలో స్పృహతప్పి పడి ఉన్నాడు. వెంటనే అతనికి తగిన వైద్యం అందించబడింది. స్వామివారి అనుగ్రహంతో ప్రమాదం నుండి బైటపడ్డాడు.

రెండు రోజులు గడిచాయి. మేమంతా 'త్రయీ'లో స్వామి సన్నిధిలో కూర్చుని ఉన్నాం. స్వామి ఉయ్యాలలో ఆసీనులై ఉన్నారు. ఎదురుగా నేను, నా ప్రక్కనే ఈ ఫిట్స్ వచ్చిన విద్యార్థి కూర్చుని ఉన్నాడు. స్వామివారు ముందుకు వంగి చాలా నెమ్మదిగా కేవలం నాకు, ఈ విద్యార్థికి మాత్రమే వినిపించేటట్లుగా తమిళంలో, "బంగారూ, మందులు కొనుక్కోవడానికి డబ్బులు లేకపోతే నువ్వు స్వామికి చెప్పకూడదా. స్వామి నీకు డబ్బు ఇచ్చేవారు కదా" అన్నారు. నా మాతృభాష మళయాళం అయినప్పటికీ నాకు తమిళం కూడా తెలిసి ఉండటంవల్ల స్వామి అతనితో ఏమన్నారో నాకు అర్థమైంది. నాకు తమిళం వచ్చునన్న విషయం ఇతనికి మాత్రం తెలియదు. డబ్బుల్లేక మందులు మానేయటంవల్లనే అతనికి ఫిట్స్ వచ్చాయని గ్రహించాను. తరువాత మేం హాస్టల్లో మా గదికి వెళ్ళాకా, నేను అతనితో మందులు కొనుక్కోవడానికి డబ్బులు లేవన్న విషయం మాతో ఎందుకు చెప్పలేదని అడిగితే, అతడు ఆశ్చర్యపోయి ఆ విషయం నీకలా తెలిసిందని అడిగాడు. అంతేకాక తనవద్ద డబ్బులు లేవన్న విషయం స్వామితో చెప్పటానికి సిగ్గుపడ్డానని కూడా అన్నాడు.

దీనికి ముందు వివరించిన సంఘటనలో పరోక్షంలో చేసిన సవాలుకు భగవానులు స్పందిస్తే, ఇక్కడ నోరు విప్పి చెప్పని విషయాన్ని కూడా వారు విని స్పందించారు. చిన్న

చీమ వేసే అడుగుల సవ్వడిని సైతం వినగలిగిన దైవానికి మన మనోభావాలను వినడం కష్టమంటారా?!

❖❖❖

భగవానుల సర్వజ్ఞత్వాన్ని తెలియజేసే ఒక సంఘటన వివరిస్తాను. కొంత హాస్యంగా అనిపించే ఈ సంఘటన నేను బృందావనంలో బి.కామ్. ప్రథమ సంవత్సరంలో ఉండగా జరిగింది. మా తోటి విద్యార్థి స్వామివారికి అందజేయాలనే ఉద్దేశ్యంతో ఒక లేఖ వ్రాసి, ఒక కవరులో పెట్టి తీసుకుని వెళ్ళాడు. కానీ స్వామి అతని లేఖను తీసుకోలేదు. సాధారణంగా మొదటి ప్రయత్నంలో సాధ్యం కాకపోయినా రెండవ లేక మూడవ ప్రయత్నం ఫలించి విద్యార్థులు తమ లేఖలను స్వామికి సమర్పించుకోగలిగే వారు. ఐతే, ఈ విద్యార్థి దాదాపు రెండు వారాలు ప్రయత్నించినా స్వామి అతని లేఖ తీసుకోలేదు. చివరకు ఇతడు తాను వ్రాయకూడనిదేమైనా వ్రాశానా, లేక లేఖలో ఏమైనా పొరపాట్లు ఉన్నాయా అనే సందేహానికి గురైనాడు. అందువల్ల ఒకనాడు ఆ లేఖను తిరిగి పరిశీలించాలని కవరు తెరచి చూసి అవాక్కయ్యాడు. ఆ కవరులో తాను స్వామికి వ్రాసిన లేఖ లేదు, తమ క్లాసులో నిర్వహించబడిన అకౌంటెన్సీ పరీక్ష తాలూకు కాగితం ఉంది. వెంటనే అతడు తన పుస్తకాల గూడునంతా వెదకి చూస్తే స్వామికి వ్రాసిన లేఖ ఒక మూల కనిపించింది. ఇతను కంగారులో లేఖకు బదులుగా ఆ పరీక్ష పత్రాన్ని కవరులో పెట్టేసాడన్నమాట. సర్వజ్ఞులైన స్వామి అందుకే ఆ కవరు పుచ్చుకోలేదు. ఆ విద్యార్థి తాను వ్రాసిన లేఖను తిరిగి జాగ్రత్తగా కవరులో పెట్టి తీసుకుని వెళ్ళాడు. ఆ రోజునే స్వామివారు అతని లేఖను తీసుకున్నారు.

❖❖❖

పైసంఘటనలు నాలో భగవద్విశ్వాసాన్ని బలపరచడమే కాక, ప్రార్థనలోని అద్వితీయమైన శక్తి నా అవగాహనలోకి వచ్చేటట్లు చేశాయి. ప్రార్థన అనే ప్రక్రియతో నేను చేసిన ఒక ప్రయోగాన్ని గురించి కూడా మీకు చెబుతాను. బృందావనం కళాశాలలో చేరిన తరువాత స్వామివారి సమక్షంలో జరిగే భజనలో పాడాలన్న కోరిక నాలో నానాటికీ బలీయం కాసాగింది. అయితే ఇది నెరవేరడానికి స్వామివారి అనుమతి లభించాలి. భజనలో పాడాలనుకునే విద్యార్థులు సాధారణంగా దర్శనం సమయంలో స్వామివారు తమ సమీపానికి రాగానే మోకాళ్ళపై లేచి నేరుగా స్వామిని అనుమతి కోరడం, లేదా లేఖద్వారా తమ ప్రార్థనను విన్నవించుకోవడం జరిగేది. అయితే నేను ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. ఒకసారి నా చేతిలోని లేఖను చూసి స్వామి చిరునవ్వుతో, "ఏమిటిది, నీ పెళ్ళి పత్రికా?" అని వెళ్ళిపోయారు. మరొకసారి నా లేఖ వైపు చూసి స్వామివారు ప్రక్కనున్న విద్యార్థితో, "వీనికి ఇంటర్వ్యూ కావాలట, నువ్వు ఇవ్వు" అని నన్ను ఆటపట్టించి వెళ్ళిపోయారు. తరువాత పరిణామమేమంటే స్వామివారు నేను కూర్చున్న వరుసవైపు రావడమే మానేశారు. దానితో నా ప్రక్కన కూర్చుంటే స్వామి దగ్గరకు రారని ఇతర విద్యార్థులకు కూడా తెలిసిపోయి, అంతా నన్ను తప్పించుకు తిరగటం ప్రారంభించారు. ఇలాంటి బాధాకరమైన, నిరాశా నిస్పృహలతో కూడిన పరిస్థితులలో నాకు ఏం చేయాలో తోచలేదు. ఇక స్వామి సమక్షంలో నాకు పాడే అవకాశం లభించదని నిర్ణయించుకున్నాను.

ఆ తరువాత ఒకనాడు స్వామివారు 'త్రయీ'లో దివ్యోపన్యాసం గావిస్తూ, ఒక పాట పాడారు.

"అడుగకవే ఓ మనసా!
అడుగుకొలది అది అడుగున పడునని
అడుగకున్న పని వడిగా నగునని
అడుగకవే ఓ మనసా!
అడుగని శబరిని ఆదరించడే!
అడుగక తనకై మడియు జటాయువు
కడకునేగి సద్గతి కలిగించడే!"

ఈ పాట వినగానే ఇది నాకోసమే చెప్పబడిందని నేను భావించి, మనసులోనే ఇలా అనుకున్నాను, 'స్వామీ! ఇప్పటినుండి నేను మీకు లేఖలు వ్రాయను. పాడటానికి అవకాశం ప్రసాదించమని అడగను. కేవలం మనసులో ప్రార్థన మాత్రమే చేస్తాను. ఎప్పుడు ప్రాప్తి ఉంటే అప్పుడు భజన పాడే అవకాశం నాకు అనుగ్రహించండి'. నేను ప్రార్థనతో చేసిన మొదటి ప్రయోగం ఇది.

ఆ రోజు నుండి నేను నామస్మరణ చేస్తూ స్వామివారిని మనసులోనే ప్రార్థించసాగాను. కొద్ది రోజులు గడవగానే ఒకనాడు స్వామివారు, వార్డెన్‌గారిని పిలిచి, "కొత్త పిల్లలు ఎక్కడ? వాళ్ళు భజనలు పాడితే వినాలనుకుంటున్నాను" అన్నారు. ఆ మరునాడే నేను భజనలో పాడటానికి ముందు జరిగే స్వరపరీక్షకు కూర్చున్నాను. అప్పుడు నేను, 'సాయి హమారా హమ్ సాయీకే ఐసా ప్రేమ్ హమారా' అన్న భజన పాడాను. ప్రార్థనతో నా ప్రయోగం ఫలించడంతో నాకు చాలా ఆనందం అనిపించింది.

అప్పటినుండి నేను నాకు ఏ అవసరం కలిగినా స్వామిని హృదయపూర్వకంగా ప్రార్థన చేసేవాడినే తప్ప లేఖలు వ్రాసేవాడిని కాను. అయితే స్వామివారికి లేఖలు వ్రాయకూడదని మాత్రం దీని తాత్పర్యం కాదు, ఎందుకంటే అలా లేఖలు వ్రాయడాన్నికూడా స్వామివారు ఒక గొప్ప సాధనగా నిర్ధారించారు. స్వామివారి అనుగ్రహాన్ని పొందడానికి అనేక మార్గాలు. ఒక్కొక్కరిది ఒక్కొక్క మార్గం. అన్నీ విశిష్టమైనవే. అయితే నేను అంతర్ముఖంగా చేసే ప్రార్థనా మార్గాన్ని ఎన్నుకున్నాను.

❖❖❖

స్వామి ప్రత్యక్షంగా నా ఎదురుగా ఉండి, చాలామందికి పాదస్పర్శన రూపంలో తమ సామీప్యాన్ని అనుగ్రహిస్తూ, కొంతమందిని తలపై అభయహస్తాన్ని ఉంచి ఆశీర్వదిస్తూ ఉన్నప్పుడు అట్టి మహద్భాగ్యానికి నేను నోచుకొనలేక పోతున్నానే అనే బాధ కలగడం సహజమే కదా. అలాంటి సమయాలలో నేను స్వామి అంతర్యామి కాబట్టి వారు నా హృదయసీమలో కూడా ఉన్నారనే దృఢ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సాధన చేశాను. ఈ ప్రయత్నంలో నాకు 'అంతరంగ సాయి అనాథనాథ సాయి' అనే భజన ఎంతో సాంత్వననిచ్చేది.

హృదయపూర్వకంగా చేసే ప్రార్థనకు స్వామివారు మెరుపులా ప్రతిస్పందిస్తారనే విషయాన్ని నేను చాలా దృఢంగా విశ్వసించాను, ఐతే విశ్వాసం పరీక్షింపబడినప్పుడే మన సాధనలోని సుస్థిరత్వం వెల్లడవుతుంది. ఒకసారి బృందావనం సాయిరమేశ్ హాలులో విజయదశమి వేడుకలు జరుగుతున్నాయి. వేదికమీద ప్రసిద్ధ గాయనీమణి శ్రీమతి సుశీలగారు వీనులవిందుగా భక్తిగీతాలు ఆలపిస్తున్నారు. స్వామి వేదిక ఎదురుగా విద్యార్థుల మధ్యలో కూర్చున్నారు. ఆ దృశ్యం చూడగానే నాకు అక్కడ స్వామికి సమీపంగా చుట్టూకూర్చున్న విద్యార్థులు ఎంతటి అదృష్టవంతులో కదా అనిపించింది. అంతేకాదు, ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్నా నేను స్వామివారి సామీప్యాన్ని పొందలేకపోయానని, వారు నా తలపై తమ అభయహస్తాన్ని ఉంచి నన్ను దీవించలేదని నా మనసులో ఒక తీవ్రమైన బాధ బయలుదేరింది. 'స్వామీ, ఒక్కసారైనా తమ దివ్యహస్తాన్ని నా తలపై ఉంచి ఆశీర్వదించండి' అని ఎంతో ఆవేదనతో ప్రార్థించసాగాను.

ఇంతలో కార్యక్రమం ముగిసింది. స్వామి వేదికపైన ఉన్న కళాకారులను ఆశీర్వదించడానికి లేచి వెళుతూ, హఠాత్తుగా ఆగిపోయి, వారికోసం వేసిన తివాసీ దారిని వదలి, తమ చుట్టూ కూర్చున్న విద్యార్థుల మధ్యలో త్రోవచేసుకుంటూ నడవసాగారు. అంతవరకు స్వామివారికి ఎంతో దూరంగా కూర్చొని ఉన్న నేను అనూహ్యంగా వారు నడిచే త్రోవ ప్రక్కన ముందు వరుసలో ఉన్నాను! మధ్యమధ్యలో స్వామివారు ఊతకోసం అన్నట్లు దగ్గరలో ఉన్న విద్యార్థి తలపై చేయి ఉంచి ముందుకు సాగుతున్నారు. ఇలా నా సమీపానికి రాగానే నా తలపై తమ చేయినుంచి, నాకు ఆ ప్రేమాస్పదమైన అనుభూతి కలిగేలా నా తలను గట్టిగా వత్తి ముందుకు నడిచారు. నేను ప్రార్థన చేసి కొన్ని క్షణాలుకూడా కాలేదు. నా ప్రార్థనకు ప్రేమయే కరిగి నావైపు ప్రవహించినట్లనిపించింది. ఆ క్షణంలో నా కళ్ళు ధారాపాతంగా వర్షించాయి.

❖❖❖

హృదయాంతరాళాల్లో మౌనంగా సాగే ప్రార్థన అనే సాధనకు సంబంధించి నా అవగాహనను మరింత దృఢతరం చేయడానికి భగవాన్ నాకు మరొక అనుభవాన్ని అనుగ్రహించారు.

ఒకరోజు సాయంత్రం ప్రశాంతి మందిరంలో భజనలు పాడే విద్యార్థుల జాబితాలో నా పేరు కనబడలేదు. పాడగలిగే విద్యార్థులు ఎక్కువమంది ఉండటంచేత అందరికీ అవకాశం ఇచ్చే ఉద్దేశ్యంతో మా భజన గ్రూపు ఇన్‌ఛార్జి ఆరోజున పాడేవారి జాబితాలో నా పేరు

వ్రాయలేదేమో అనుకున్నాను. రెండవ రోజున కూడా నా పేరు భజన గాయకుల జాబితాలో లేకపోయేసరికి నాకు కొద్దిగా ఆశ్చర్యం కలిగింది. వరుసగా మూడవ రోజున కూడా భజన పాడటానికి నాకు అవకాశం రాకపోయేసరికి నేను చాలా కంగారుపడ్డాను. ఏదో పొరపాటు చేసి ఉంటానని గ్రహించి మనసులోనే చాలా మథనపడుతూ ఉండగా, తోటి విద్యార్థి ఒకరు వచ్చి నాతో, "సోదరా! నీ కంఠస్వరాన్ని గురించి స్వామి ఏదో అన్నారని తెలిసింది. అందుచేతనే మీ భజన గ్రూపు ఇన్‌ఛార్జి నీకు అవకాశం ఇవ్వటంలేదేమో" అని మాత్రం చెప్పాడు. ఈ పరిస్థితిలో తిరిగి స్వామి కరుణించి స్వయంగా కలుగజేసుకుంటే తప్ప నాకు మళ్ళీ భజన పాడే అవకాశం ఉండదు.

ఇలాంటి క్లిష్టపరిస్థితిలో నేను తిరిగి ప్రార్థనా మార్గాన్నే అనుసరించాలనుకున్నాను. ఇంతలో ఒక సీనియర్ విద్యార్థి నా వద్దకు వచ్చి, "తమ్ముడూ! నీకు భజన పాడే అవకాశం రావడం లేదు కదా, మరి నువ్వు ఏం చేస్తున్నావు?" అని అడిగాడు. "అన్నయ్యా! నేను మనస్ఫూర్తిగా స్వామిని ప్రార్థిస్తున్నాను" అని చెప్పాను. అప్పుడా విద్యార్థి, "తమ్ముడూ! కేవలం మనసులో ప్రార్థన చేసినంతమాత్రాన చాలదు. పాడే అవకాశం ఇవ్వమని ప్రార్థిస్తూ స్వామివారికి ఒక ఉత్తరం వ్రాయి" అన్నాడు.

అయితే నేను మొదటి నుండి నా సమస్యలన్నింటికీ ప్రార్థననే పరిష్కారమార్గంగా భావించి, అనుసరించాను. ప్రతి పర్యాయమూ స్వామి నా ప్రార్థనలకు స్పందించి తమ కరుణను కురిపిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు ఈ సోదరుడు కేవలం ప్రార్థనలవల్ల పని జరగదని, తప్పక ఉత్తరం వ్రాయాలని చెబుతున్నాడేమిటి! బహుశా స్వామికి నేను ఉత్తరం వ్రాయాలన్నది అతని వ్యక్తిగతమైన అభిప్రాయం కావచ్చునేమో! ఇలాంటి ఆలోచనలతో నా మనస్సు కొంత ఊగిసలాడింది.

రోజులు నా ప్రార్థనలతో గడుస్తున్నాయి. ఇంతలో భగవాన్ బాబావారి జన్మదినోత్సవం దగ్గరకు వచ్చేసింది. నవంబరు నెలలో నిర్వహించబడే అఖండభజన రోజు రానే వచ్చింది. భజనలు పాడే విద్యార్థుల జాబితాలో నా పేరు లేకపోవడంవల్ల నేను భజన హాలులో బాగా వెనక్కు కూర్చున్నాను. స్వామివారు లోపలికి వచ్చి జ్యోతిప్రజ్వలనం చేశాక అఖండ భజన ప్రారంభమైంది. సుమారు నలభై ఐదు నిమిషాలపాటు భజనలు విన్న తరవాత స్వామివారు సింహాసనం నుండి లేచి అప్పట్లో తమ నివాసమైన 'పూర్ణచంద్ర'వైపు నెమ్మదిగా అడుగులు వేయసాగారు.

ఆ సమయంలో ముందు వరుసలో ఉన్న ఒక సీనియర్ విద్యార్థి వెనక్కు తిరిగి నన్ను ముందుకు రమ్మని సైగ చేశాడు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. వెంటనే నేను లేచి ముందుకు వెళ్ళాను. ఐతే భజన ముగిసిన తరువాత నాకు తెలిసిన విషయమేమంటే నిజానికి అతను నన్ను కాక, నా ప్రక్కనున్న మరొక విద్యార్థిని పిలిచాడట. కానీ నేను నన్నే అనుకుని ముందుకు వెళ్ళాను. అప్పుడు నన్ను మళ్ళీ వెనక్కు వెళ్ళిపొమ్మంటే అంతమందిలో నేను చిన్నబుచ్చుకుంటానేమోనని నాకు పాడే అవకాశం ఇచ్చారు. నన్ను ఏ భజన పాడతావని అడిగితే ఆ క్షణంలో నాకు తోచిన భజన, "ఓ భగవాన్! ఓ భగవాన్! అరజ్ సునో మేరే సాయి భగవాన్". అప్పటికి స్వామివారు ఇంకా నెమ్మదిగా నడుస్తూ పూర్ణచంద్రవైపు వెళుతున్నారు. నా హృదయంలో గూడుకట్టిన బాధనంతా నా భజనలో నేను వ్యక్తపరిస్తే స్వామివారు తప్పకుండా నా మొరనాలకించి నాకు మళ్ళీ వారి సమక్షంలో భజన పాడే అవకాశమిస్తారని, నేను ఆ భజన పాడాను. మరునాడు ఉదయం కూడా కొనసాగిన అఖండ భజనలో నాకు మళ్ళీ అవకాశాలు ఇవ్వబడ్డాయి. అయితే, ఈసారికూడా నేను పాడిన సమయంలో స్వామివారు భజన హాలులో సింహాసనాసీనులై లేరు, కానీ వారు తప్పక నా ఆర్తిని అందుకునే ఉంటారని భావించాను.

ఆరోజు ఉదయం సుమారు పదకొండు గంటలవేళ సాయికుల్వంత్ సభామంటపంలో స్వామివారి కారు సిద్ధంగా ఉంచారు. నవంబరు 22న స్నాతకోత్సవ సందర్భంగా విద్యార్థులు వేయబోయే నాటకపు రిహార్సల్ చూడటానికి స్వామివారు యూనివర్సిటీ ఆడిటోరియమ్‌కి వెళ్ళబోతున్నారు. సరిగ్గా అదే సమయానికి నాకు భజన పాడే అవకాశం వచ్చింది. ఇంతలో స్వామి ఇంటర్వ్యూ గది తలుపులు తెరుచుకుని బైటకు వచ్చారు. నేను పాడటం మొదలుపెట్టాను. కారువైపు వెళుతున్నవారల్లా స్వామి, క్షణకాలం ఆగి వెనక్కి తిరిగి భజన మందిరంలోకి వచ్చి

తమ సింహాసనంలో ఆసీనులైనారు. మనసులోనే స్వామికి ప్రార్థనా పారిజాతాలు సమర్పించుకుంటూ 'సంకట హరణా శ్రీ సాయిరమణా' అన్న భజన పాడాను. నేను భజన పాడినంతసేపు స్వామివారు మందహాస మందారాలు వెదజల్లుతూ నాలో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపారు. నా భజన పూర్తి అయిన వెంటనే వారు లేచి కారులో యూనివర్సిటీ ఆడిటోరియమ్‌కి వెళ్ళిపోయారు. 'నీ భజన వినడానికే నేను వచ్చాను సుమా' అని స్వామివారు నాతో అన్నట్లు అనిపించింది. దైవదయార్ణవాన్ని వర్ణించడం ఎవరికి సాధ్యమవుతుంది!

ఆరోజు సాయంత్రం అఖండ భజన ముగింపులో, స్వామి సమక్షంలో భజనలు పాడే విద్యార్థుల జాబితాలో నా పేరు ఉండటం నాకు అమితాశ్చర్యానందాలు కలిగించింది. ఇది ఎలా జరిగిందో ఒక సోదర విద్యార్థి వివరించిన మీదట నాకు కూడా తెలిసింది. ఆ వివరణ సారాంశమేమిటంటే, ఆరోజు ఉదయం స్వామివారు యూనివర్సిటీ ఆడిటోరియమ్‌కు వెళ్ళినప్పుడు అక్కడున్న కొందరు విద్యార్థులతో, "నేను మీకు భజనలు పాడే అవకాశం ఇస్తూ ఉంటే, మీలో చాలామంది సరిగ్గా కోరస్ పాడకుండా, తరువాత మీరు పాడబోయే భజనకు శ్రుతి చూసుకుంటూ ఉన్నారు. ఇది సరికాదు. ఆ 'పేరట్ వాయిస్'ను చూడండి, (అంటే, 'చిలుక గొంతు', అప్పట్లో స్వామివారు నన్ను ఈ పేరుతోనే సంబోధించేవారు) వాడు నాకు ఒక ఉత్తరం వ్రాశాడు. 'స్వామీ! నాకు మళ్ళీ మీ సమక్షంలో పాడే అవకాశం దయతో కల్పించండి, నాకు హార్మోనియమ్ సహకారం లేకపోయినా ఫరవాలేదు' అని ఎంతో ఆర్తిగా వ్రాశాడు. కానీ మీరు మాత్రం మీకు లభించిన అవకాశం యొక్క విలువను గుర్తించటంలేదు" అన్నారట.

ఆవిధంగా స్వామివారు నా పేరు ప్రస్తావించటంతో నాకు మళ్ళీ వారి దివ్యసమక్షంలో పాడే అవకాశం లభించింది. ఐతే ఇక్కడ మీకు ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. నేను స్వామివారికి ఏ ఉత్తరమూ వ్రాయలేదు. మొదటినుండి నేను 'అంతరంగ సాయి'తో అనుసంధానం ఏర్పర్చుకోవటానికి ఎంచుకున్న మార్గం అంతర్గతమైన ప్రార్థనే. ఐతే, స్వామికి మన ప్రార్థనను ఉత్తరాల రూపంలో

సమర్పించుకోవటం కూడా ఒక గొప్ప సాధనే! సందేహం లేదు. స్వామికి ఉత్తరం వ్రాయమని నాతో చెప్పిన విద్యార్థి ఆ సమయంలో ఆడిటోరియంలో స్వామి సమక్షంలోనే ఉన్నాడు. అందువల్ల, అతని సలహా మేరకు నేను ఉత్తరం వ్రాసినందువల్లనే స్వామి నన్ను కరుణించారని అతను అనుకున్నాడు. ఆవిధంగా అతడు నమ్మిన మార్గంలో స్వామి అతడిని సుస్థిరం చేసారు. ఉత్తరం వ్రాయకుండా కేవలం మానసిక ప్రార్థనద్వారా నేను తిరిగి స్వామి దయకు పాత్రుడను కావటంవల్ల నా సాధనామార్గంలో నేను దృఢపడ్డాను. ఇలా మా ఇరువురి సాధనాపథాలను స్వామి ఆమోదించారు.

భగవాన్ నాయెడల అనంతమైన కరుణతో అనుగ్రహించిన ఆధ్యాత్మిక శక్తి ఊతగా ఈ ప్రార్థనా సాధనామార్గంలో నేను ఇప్పటికీ ఎంతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాను.

తెలుగుసేత: డా॥ వజ్జల సత్యకమలాకర్

❖❖❖

'సనాతన' అక్షర సౌరభాలు:

జీవుడే దేవుడు

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు బుక్కపట్టణంలో శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయమున విద్యుద్దీపములను వెలిగించిన తరువాత అక్కడ చేరిన భక్తుల నుద్దేశించి అనుగ్రహించిన దివ్యసందేశము (18.7.1961):

ప్రేమస్వరూపులారా! దేహమే ఒక దేవాలయము, జీవుడే దేవుడు. ఆ దేవాలయములో అహంకారమనే అంధకారమును పోగొట్టుకొనేదానికి దీపములను వెలిగించవలయునుకానీ కేవలం ఈ దేవాలయములో దీపము పెట్టితే ప్రయోజనము లేదు. ఈ లక్ష్మీనారాయణ దేవాలయములో చీకటి లేదు. ఇక్కడికి వచ్చేవాండ్ల హృదయములో చీకటి ఉన్నది. చీకటి మానవునికేకాని మాధవునికి కాదు. పరమాత్ముడే దేదీప్యమానముగా ప్రకాశిస్తున్నాడు. కోటిసూర్యుల ప్రకాశమువలె ప్రజ్వలిస్తుండే దేవునికి విద్యుచ్ఛక్తి దీపాలు ఏమాత్రము వెలుతురు ఇస్తాయి?! ప్రశాంతి నుంచి ప్రకాంతి, ప్రకాంతినుంచి పరంజ్యోతి, ఇట్లు మానవుడు తనలోపల ఉండు అంధకారమును నాశనము చేయవలయును. వెలుతురులోపలనే ఆనందము! దీపములు వెలిగించిన తరువాత, ఆ వెలుతురుకు తగిన పవిత్రతను ఇవ్వండి, ఆ వెలుతురులో పవిత్ర కార్య కర్మములనే ఆచరించండి.

ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ చూచినా అశాంతియే కనబడుతుంది. శాంతి, సంతోషము ఎవరికీ లేవు. భౌతిక అభివృద్ధి యేమో చాలా జరిగినది. అయితే నీతి, నియమము, శీలము, ఇవి అభివృద్ధి కాకపోయినవి. నడచెడువారికి కర్ర ఉంటే కొంచెము హాయి. అయితే, పాదములలో శక్తిలేకపోయిన, కర్ర మాత్రము ఏమి చేస్తుంది?! అట్లే ఆధ్యాత్మిక చింతన, దైవచింతనలేక, వట్టి భౌతిక అనుకూలము అనే కర్ర మాత్రము పట్టుకొంటే నడచలేదు.

సనాతన సంస్కృతి నిలయమే ప్రతి ఒక్క దేవాలయము కూడ. పూర్వము ఏదయినా కొత్త ఊరికి పోతే ఆ ఊరివాండ్లను అడిగేది, "మీ ఊరులో దేవాలయ మున్నదా?" అని. దేవాలయము లేని ఊరులో ఉండకూడదని అభిప్రాయము. ఇప్పుడు అట్ల కాదు, "మీ ఊరులో సినిమా హాలు ఉన్నదా?" అని అడుగుతారు. ఈ లక్ష్మీనారాయణ దేవాలయమును సరిచేయడము బుక్కపట్నమువాండ్ల పవిత్ర కర్తవ్యము. ఈ దేవాలయమునకు విద్యుద్దీపములు వేయడానికి పిల్లలు ఎంతో కృషి చేసినారు అని ఇప్పుడు వారి రిపోర్టులో విన్నాము. భగవత్ చింతనలో ఎంతటి శాంతి సంతోషములున్నవి, గ్రామమునకు దేవాలయము ఎంత ముఖ్యమయినది అని యోచిస్తే, ఎవరయినా ఒకరు పూర్తి చేయవచ్చు ఈ చిన్న కార్యమును.

తరతరములనుంచి పోషించుచూవచ్చిన సంస్కారమును, సంప్రదాయములను, ధర్మమును, కర్మములను

విడువకూడదు. తర్కము, వాదము పనికిరాదు. ఏమీ తెలియనివాళ్ళకే తర్కము, వాదము. భక్తి శ్రద్ధలుంటే చాలు. పోయిన నెల 5వ తేదీ నుండి 28 తేదీవరకు మేము ఉత్తరప్రదేశములో ఉంటిమి. ఎక్కడ పోయినా పుట్టపర్తి, బుక్కపట్నం అనే గ్రామములను ప్రస్తావించడము, పొగడడము చూస్తే చాలా ఆశ్చర్యమౌతుంది. వారు ఎంత దూరములో ఉండిననూ ఆధ్యాత్మికములో చాలా దగ్గర. మీకు వెలుతురు మాత్రమే కనబడినది. వేడి తగలడము లేదు. కాబట్టి దగ్గరస్థలమయిననూ దూరమున్నట్లే. వేడి వెలుతురు రెండూ వాళ్ళవాళ్ళ సంస్కారముయొక్క ఫలితమే కానీ, వేరుకాదు.

ధర్మానికి నిలబడే నీడలేదని విచారిస్తున్నవారికి బదరీయాత్ర మంచి ధైర్యమిస్తుంది. ఎన్ని లక్షల మంది కష్టనష్టాలను లెక్కచేయక కేవలము భక్తితో ఆ బదరీ నారాయణుని దర్శనమునకు వెళ్ళుతారంటే, ఎంత గొప్ప విషయము, యోచించండి. వాళ్ళందరికీ శాంతి సంతోషాలు ఒక్క భగవత్ చింతనలో తప్ప మరెక్కడను లేవు.

ఇప్పుడు తెలివి ఎక్కువ, బుద్ధి తక్కువ. తెలివి పెద్ద పెనుభూతముగా పెరిగిపోయినది. దానికి తగినట్లు బుద్ధి పెరుగలేదు. బుద్ధిని పెంచుకోవలయును. అప్పుడు శీలము కూడా మంచిదవుతుంది. వివేకస్వరూపుడవుతాడు. ముఖ్యముగా హేళనము, అసూయ, అహంకారము, వీటిని మనస్సు నుంచి తొలగించుకోవలయును.

మానవుడంటే మనసును స్వాధీనం చేసుకొనినవాడు. కేవలం తెలివి పెరిగినవాడనికాదు. దివ్యత్వము, పవిత్రత ఇవి మానవ హృదయములోనే ఉన్నవి. వాటికొరకు వేరెక్కడనూ వెతికే అవసరములేదు. ఉదయమునకు, అస్తమయమునకు ఒక సూర్యుడే కదా! అట్లనే సుఖము, దుఃఖము, రెంటికి ఒక మనసే కారణము. ఆ మనసును అరికట్టి దానికి తగిన శిక్షణ యిస్తే నిత్యానందమును అనుభవించవచ్చును.

తెల్లని బట్టకు మలినమైతే, నీటిలో తడిపి సబ్బువేసి ఉడకపెట్టి రాయిమీద కొట్టి మంచినీటిలో పిండవలయును కదా! అట్లే నీతి నిష్ఠ అనే జలముతో పరమాత్మచింతన అనే సబ్బువేసి జ్ఞానముతో ఉడకబెట్టి వైరాగ్యమనే రాయిపైన కొట్టితే మరి దాని సహజమయిన తెల్లదనము కనిపిస్తుంది. నియమ నిష్ఠలు చాలా అవసరము.

విద్యుచ్ఛక్తి అని అందరూ చెప్పుతారే కానీ ఆ శక్తి యొక్క నిజస్వరూపమేమని యెవరికీ తెలియదు. అట్లనే, ఆత్మ అంటే యేవి? దాని శక్తి నుంచి దివ్యప్రకాశమెట్ల ఉత్పత్తి అవుతుంది? అనేది ఎవరు చెప్పగలరు! తెలిసికోలేను అని తెలిసికొనేదే ఉత్తమమయిన తెలివి.

(మూలం: 1961 ఆగస్టు నెల 'సనాతన సారథి')

శ్రీ సత్యసాయి గీతములు – 17

పుట్టపర్తి సాయిదేవా...

పుట్టపర్తి సాయిదేవా!
పట్టువిడక బ్రోవరావ

ప్రాపు నీవె – వేగ రావ
నా ప్రాణమివ్వ దేవా

పరుగెత్తి వేగ రావ
పాలింప మమ్ము బ్రోవ

దిక్కు వేరు లేరు సాయి
దారి జూప రావవోయి

తాపమార్ప వేగ రావ
తండ్రి సత్యసాయి దేవా!

కాంతొసగి బ్రోవ రావా
సంతోషమివ్వ దేవా!

శాంతొసగి జూప రావ
ప్రశాంతి నిలయమివ్వ ❖

పరిమళించిన పూలతోట

డా॥ కరుణశ్రీ

భగవాన్ అవతరణం
జగతికి జాగరణం
భగవాన్ సంస్మరణం
ప్రగతికి రవికిరణం
సత్యసాయి దర్శనం
సౌందర్య నిదర్శనం
సత్యసాయి దరహాసం
విజయశ్రీకి వికాసం

భగవాన్ కృపాకటాక్షం
పండిన కల్పవృక్షం
భగవాన్ మృదుకర స్పర్శ
కన్నతల్లి పరామర్శ
సత్యసాయి పదసన్నిధి
సర్వసౌఖ్యముల పెన్నిధి
సత్యసాయి దివ్యవాణి
క్షమా సమతా మమతల త్రివేణి

భగవాన్ బృందావనం
భారత సంజీవనం
భగవాన్ ప్రశాంతినిలయం
ప్రపంచ తేజోవలయం
సత్యసాయి అనుగ్రహం
శాంతికి శయన గృహం

భగవాన్ ధర్మదీక్ష
జాతికి శ్రీరామరక్ష
స్వామి సనాతన సారథి
ప్రేమసుధారస నీరధి
స్వామి ఉదయం రత్నాకరం
స్వామి హృదయం కరుణాకరం

మా స్వామి సర్వాంతర్యామి
ఇది పద్యం కాదు –
ఎదలో మారుమ్రోగుతున్న
మంగళవాద్యం
ఇది పాట కాదు –
పరవశించిన గుండెలో
పరిమళించిన పూలతోట

ఈ పూలతోట
తోటమాలి మా స్వామి
కోటి కోటి పూలతోటల
ఆసామి మా స్వామి ❖

"జగత్పతే హరి సాయిగోపాలా..." (భగవాన్ సన్నిధిలో గోకులాష్టమి, 1980వ దశకంలో)

REGD. WITH REGISTRAR OF NEWSPAPERS R.NO. 10772/64 REGN.NO. HDP/001/2021-2023
Licenced to post without prepayment No. PMGK/RNP/WPP-02/2021-2023

Date of Publication 23rd July 2021

మృగస్వేచ్ఛ కాదు, మానవస్వేచ్ఛ

కొందరు యువకులు అనుకుంటారు, "చేపలు నీటిలో స్వేచ్ఛగా సంచరిస్తున్నవి. పక్షులు ఆకాశంలో స్వతంత్రంగా విహరిస్తున్నవి. అడవిలో పుట్టిన మృగములు స్వేచ్ఛ ననుభవిస్తున్నవి. మరి మానవుడు ఎందుకు స్వేచ్ఛగా సంచరించకూడదు?" చేపలు, పక్షులు, మృగములు స్వేచ్ఛగా సంచరించే మాట వాస్తవమే! కానీ, అవి ఎట్టి స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి? చేపలు చేపస్వేచ్ఛను, పక్షులు పక్షిస్వేచ్ఛను, మృగములు మృగస్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. కనుక, నీవుకూడా మానవునిగా మానవస్వేచ్ఛ ననుభవించు, మృగస్వేచ్ఛ ననుభవించకు. "నేను మనిషిని" అంటూ మృగమువలె సంచరించడం స్వేచ్ఛ కాదు. మృగస్వేచ్ఛ ప్రమాదకరం. మానవునికి ఉండ వలసినది మానవ స్వేచ్ఛయే. ఎటువంటిది అది? మనిషికి కొన్ని నియమములున్నాయి. సత్యమార్గంలో ప్రవేశించాలి. ధర్మాన్ని అనుసరించాలి. ప్రేమను పెంచుకోవాలి. శాంతితో జీవించాలి. అహింసను పాటించాలి. ఈ ఐదింటితో మానవుడు స్వాతంత్ర్యమును అనుభవించాలి.

- శ్రీసత్యసాయి

చందాలు చెల్లించగోరువారు ఈ 'క్యూఆర్' కోడ్‌ను స్కాన్ చేసి, 'యుపిఐ' పేమెంట్ ట్రాన్సాక్షన్ నెంబరు మరియు చందాదారుని పూర్తి అడ్రసు, ఫోను నెంబరు మా ఇమెయిల్ అడ్రసుకు (subscriptions@sssbpt.org) గాని, వాట్సాప్ నెంబరుకు (9440287375)గాని తెలియజేయవలసిందిగా కోరుతున్నాము.

వార్షిక చందా: ₹ 90 (భారతదేశంలో), విదేశాలకు
₹ 900 లేక £ 13 (UK) లేక $ 18 (US)

చందాలు 'క్యూఆర్' కోడ్‌ద్వారా, లేక మనీయార్డరు, లేక పర్సనల్ చెక్, లేక డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా, లేక మా వెబ్‌సైటు www.sanathanasarathi.org ద్వారా ఒకటి లేక రెండు లేక మూడు సంవత్సరములకు చెల్లించవచ్చును. మా చిరునామా: పబ్లికేషన్స్ డివిజన్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, ప్రశాంతినిలయం – 515134

SCAN & PAY

Printed and published by K.S. Rajan on behalf of the owner Sri Sathya Sai Sadhana Trust, Publications Division, Prasanthi Nilayam - 515134, Ananthapuram district (A.P.) and printed at Sri Sathya Sai Press, within Sri Sathya Sai Ashram premises, Prasanthi Nilayam and published at Prasanthi Nilayam. Editor : V. Srinivasulu